E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 20-01-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక: 20 || పేజీలు–6 www.ekaburu.com




కొండెక్కిన వెండి.. పరుగాపని పసిడి! » 2లో

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు

## సిట్ నోటీసులు



» నేడు విచారణకు రావాలని సూచన
» ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ఈకబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, భారాస నాయకుడు హరీశ్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. హరీశ్‌రావు జిల్లా పర్యటనలో ఉండటంతో సిట్ సిబ్బంది నోటీసులను కోకాపేటలోని ఆయన ఇంట్లో ఇచ్చి వెళ్లారు. దాదాపు రెండేళ్లుగా జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా భారాస అగ్రనేతను విచారించేందుకు నోటీసు జారీ చేయడం ఇదే ప్రథమం. ఫోన్ ట్యాపింగ్ కేసు అనేక మలుపులు తిరుగుతున్న విషయం తెలిసిందే. భారాస అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు, వ్యాపారులు మొదలు జడ్జీల ఫోన్లనూ ట్యాప్ చేశారని, వాటికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో 2024 మార్చిలో కేసు నమోదైంది. అనంతరం జరిగిన పరిణామాల్లో ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు విదేశాలకు పారిపోవడంతో దర్యాప్తునకు ఆటంకం ఏర్పడింది. మిగతా నిందితులను అరెస్టు చేసినప్పటికీ ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో చాలాకాలంపాటు దర్యాప్తు నిలిచిపోయింది. మళ్లీ గత జూన్‌లో ప్రభాకర్‌రావు హైదరాబాద్ రావడంతో దర్యాప్తు ఊపందుకుంది. ఇదే కేసులో మరో నిందితుడైన ఐన్యూస్ ఎండీ శ్రవణ్‌రావు కూడా అంతకుముందే విదేశాల నుంచి తిరిగివచ్చారు.

తరువాయి 2లో

# మేడారం మెరిసేలా



» ప్రభుత్వ సంకల్పం, అమ్మవార్ల దయతోనే వంద రోజుల్లో గద్దెల పునర్నిర్మాణం
» సమ్మక్క, సారలమ్మల గద్దెల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
» వన దేవతలకు మొక్కుల చెల్లింపు
» పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు

**ఈ-కబురు, వరంగల్: మేడారంలో వన దేవతల గద్దెల పునర్నిర్మాణ పనులను ప్రభుత్వ సంకల్పం, అమ్మవార్ల దయతో వంద రోజుల్లోనే పూర్తి చేశామని... ఇందులో అందరి కృషి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగు జిల్లా మేడారంలో పునర్నిర్మించిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మల గద్దెలను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆదివారం మేడారానికి చేరుకుని...**

తరువాయి 2లో

అభివృద్ధి పనుల పరిశీలన, మంత్రివర్గ సమావేశం, ఆదివాసీ సంప్రదాయ కళాప్రదర్శన కార్యక్రమాలతో బిజీగా గడిపిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దలు రాత్రి ఇక్కడే బస చేశారు. సోమవారం ఉదయం 6:40 గంటలకు గద్దెల పునర్నిర్మాణానికి సూచికగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం ఆవిష్కరించారు. తన సతీమణి, కుమార్తె, అల్లుడి సమక్షంలో మనవడితో కలిసి ఎత్తు బంగారాన్ని(బెల్లం) అమ్మవార్లకు మొక్కుగా సమర్పించారు. తర్వాత అంతా కలిసి గద్దెలను దర్శించుకున్నారు. వీరందరికీ పూజారులు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. అంతకు ముందు గద్దెల వద్ద అతిథులకు ఆదివాసీ సంప్రదాయ డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. గద్దెల ప్రారంభోత్సవం సందర్భంగా పాత్రికేయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముచ్చటిస్తూ... మేడారంలో చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు. ప్రభుత్వం చేపట్టిన పనులపై అభిప్రాయం చెప్పాలని వారిని అడిగారు. మేడారంలో చేపట్టిన నిర్మాణాలు, ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. ఇంకా చేయాల్సినవి ఏమైనా ఉంటే చెప్పాలని అధికారులకు సూచించారు. మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన అంశాలపై వారితో చర్చించారు. గద్దెల వద్దకు చేరుకున్న సమయంలో భక్తులతో కరచాలనం చేస్తూ... వారిని ఆప్యాయంగా పలకరించారు. భక్తులు, పూజారులు, కళా బృందాలు, అధికారులతో ఉత్సాహంగా ఫొటోలు దిగారు. మేడారంలో గద్దెల పునర్నిర్మాణంలో పాలుపంచుకున్న అధికారులను అభినందించారు.

అమ్మవారికి ఎత్తుబంగారాన్ని తన మనవడితో కలిసి సమర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే రామచంద్రునాయక్ తదితరులు

రూ.1300 కోట్ల కలెక్షన్స్.. ఆ మూవీ నాగ్ చేయలేకపోయాడా? » 3లో



సంపదను పెంచి.. పేదలకు పంచుతాం » 3లో



## అజ్ఞాతం వీడిన మావోయిస్టులకు ఆధార్

ఈ-కబురు, దరాబాద్: అజ్ఞాతం వీడుతున్న మావోయిస్టులకు ఓ చిరునామా ఏర్పడుతోంది. గుర్తింపు కార్డుల్లో కీలకమైన 'ఆధార్', డబ్బు దాచుకునేందుకు బ్యాంకు ఖాతా అందుతున్నాయి. దండకారణ్యంలో తిండీతిప్పలు లేక నీరసించిన శరీరాలకు వైద్యచికిత్స లభిస్తోంది. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ నిఘా విభాగంలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) ఈ వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షిస్తోంది.



» 2లో

## బీజేపీ సారథిగా నితిన్ నబీన్

» అధ్యక్ష పదవికి నామినేషన్ వేసింది ఆయనొక్కరే
» ఎన్నిక ఇక లాంఛనం.. నేడు అధికారిక ప్రకటన
» ఆర్ఎస్ఎస్ నేపథ్యం.. ఇంటర్మీడియట్ విద్యార్హత
» తొలిసారి జాతీయ అధ్యక్షుడిగా బిహార్ నేత



ఈ-కబురు, న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీకి నూతన జాతీయ అధ్యక్షుడిగా ప్రస్తుత పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా ఎన్నిక కావడం లాంఛనప్రాయమైంది. 45 ఏళ్ల చరిత్ర గల బీజేపీకి తొలిసారిగా పార్టీ కంటే పిన్నవయస్సుగల నితిన్ నబీన్ తొలిసారి అధ్యక్షుడు కాబోతున్నారు. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, హర్దీప్‌సింగ్ పురి, కిరణ్ రిజుజు తదితరులు నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్ దాఖలు చేశారు.

తరువాయి 3లో

కొత్త పార్టీ ఏర్పాటుపై

## వేగం పెంచిన కవిత



ఈ-కబురు, హైదరాబాద్: కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వేగం పెంచారు.

తరువాయి 3లో



## ఢిల్లీ హైకోర్టులో సెంగర్‌కు చుక్కెదురు

ఉన్నావ్ కేసు బాధితురాలి తండ్రి 'కస్టడీ'మరణం కేసులో..
పదేళ్ల శిక్ష రద్దు అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు

ఈ-కబురు, న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లో ఉన్నావ్‌లో అత్యాచార బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన ఉదంతంలో దోషిగా తేలిన బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.

» 2లో

## ద్వైపాక్షిక వాణిజ్యం రూ.18 లక్షల కోట్లకు!

» భారత్, యూఏఈ నిర్ణయం
» కీలక రక్షణ భాగస్వామ్యం!
» భారత్‌కు 5 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ
» మోదీ, నహ్యాన్ కీలక ఒప్పందాలు
» యూఏఈ అధ్యక్షునికి మోదీ స్వాగతం
» ఆత్మీయ ఆలింగనం, ఒకే కార్లో ప్రయాణం
» పలు అంశాలపై గంటకు పైగా చర్చలు



**ఈ-కబురు, న్యూఢిల్లీ: ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, యూఏఈ నిర్ణయించాయి. 2032 నాటికి పరస్పర వార్షిక వాణిజ్యాన్ని ఏకంగా రూ.18 లక్షల కోట్లకు (200 బిలియన్ డాలర్లకు) పెంచుకోవాలని తీర్మానించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ప్రధాని నరేంద్ర మోదీ చర్చల సందర్భంగా పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. సోమవారం నహ్యాన్ కుటుంబసమేతంగా భారత్‌లో పర్యటించారు.**

మోదీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి మరీ ఢిల్లీలోని పాలెం విమానాశ్రయంలో ఆయనకు స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం అనంతరం అధినేతలిద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. తర్వాత చర్చల నిమిత్తం లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని అధికార నివాసానికి మోదీ, నహ్యాన్ ఒకే కారులో వెళ్లడం విశేషం! కొన్నేళ్లుగా యూఏఈతో బలపడుతూ వస్తున్న భారత బంధానికి ఈ సన్నివేశం అద్దం పట్టిందని చెబుతున్నారు. 2023-24లో ఇరు దేశాల నడుమ 84 బిలియన్ డాలర్ల మేరకు వర్తకం జరిగింది. ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే నహ్యాన్, మోదీ చర్చల సందర్భంగా భారత్, యూఏఈ నడుమ వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం దిశగా కీలక ముందడుగు పడింది. దానితో పాటు అంతరిక్ష మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా ఒప్పందం కుదిరింది. వీటి విధివిధానాల ఖరారుకు తదితరాలకు సంబంధించిన లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు జరిగాయి. దీర్ఘకాలిక ప్రాతిపదికన భారత్‌కు యూఏఈ ఏటా 5 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేసేలా కూడా ఒప్పందం కుదిరింది.

తరువాయి 2లో

## మార్కెట్‌ను ముంచిన టారిఫ్ భయాలు

» 325 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్




ఈకబురు, న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తల పెరుగుదల... ప్రత్యేకించి 8 యూరోపియన్ దేశాలపై సుంకాలు మరింతగా పెంచుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ సోమవారం తీవ్రంగా ప్రభావితమైంది. దీంతో ఈక్విటీ మార్కెట్ సూచీలు భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 672.04 పాయింట్ల మేరకు నష్టపోయి 82,898.31 పాయింట్లను తాకినప్పటికీ చివరికి నష్టాన్ని 324.17 పాయింట్లకు పరిమితం చేసుకుని 83,246.18 వద్ద ముగిసింది.

తరువాయి 3లో

## పండుగలప్పుడు ఛార్జీల పెంపా?

» విమానయాన సంస్థల తీరుపై సుప్రీంకోర్టు విస్మయం
» తాము జోక్యం చేసుకుంటామని వ్యాఖ్య



» 2లో

# మేడారం మెరిసేలా

**సీఎం, మంత్రులు, అధికారులు... 14 గంటలు మేడారంలోనే**



మేడారానికి గతంలో పలువురు ముఖ్యమంత్రులు వచ్చినా ఎవరూ ఇక్కడ బస చేయలేదు. ఈసారి ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు సుదీర్ఘ సమయం ఇక్కడే ఉండటం విశేషం. మంత్రివర్గ సమావేశాన్ని సైతం వన దేవతల చెంతనే నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 5:40 గంటల సమయంలో ఇక్కడికి చేరుకున్న సీఎం... సోమవారం ఉదయం 7:40 గంటలకు హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమయ్యారు. సుమారు 14 గంటలపాటు మేడారంలో ముఖ్యమంత్రి పర్యటన సాగింది. దావోస్‌కు వెళ్లాల్సి ఉండటంతో ఉదయమే గద్దెల ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలు ముగించుకున్నారు. కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీలు బలరాంనాయక్, మల్లు రవి, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, ఆది శ్రీనివాస్, జారె ఆదినారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బాలునాయక్, సుదర్శన్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ సుధారాణి పాల్గొన్నారు.

**తరలివచ్చిన మహిళా సంఘాలు**

వన దేవతల గద్దెల ప్రారంభోత్సవం, అమ్మవార్ల దర్శనాన్ని మహిళా సంఘాల సభ్యులతో కలిసి చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ నిర్ణయం అధికారులకు తెలియజేయడంతో వివిధ సంఘాలకు చెందిన మహిళలు ఇందిరా మహిళా శక్తి చీరలు ధరించి పెద్దసంఖ్యలో మేడారానికి సోమవారం వేకువజామునే చేరుకున్నారు. ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుంటున్న సందర్భంలో వీరంతా గద్దెల ప్రాంగణంలోనే ఉన్నారు.

# బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు సిట్ నోటీసులు




**ఫోన్ కాల్స్ ఆధారం**

దర్యాప్తులో భాగంగా.. సిట్ అధికారులు శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావులతోపాటు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావులకు మధ్య ఫోన్ సంభాషణ జరిగినట్లు గుర్తించారు. శ్రవణ్‌రావును సిట్ అధికారులు విచారించినప్పుడు వారిద్దరితో ఎందుకు మాట్లాడారని అడిగినప్పుడు, ఒక ప్రైవేట్ వేడుకలో అప్పటి మంత్రి హరీశ్, ప్రభాకర్‌రావు కలుసుకున్నారని, ఆ సందర్భంగా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలో తమ ఛానల్(ఐన్యూస్) చేసిన ఎన్నికల సర్వే గురించి ప్రస్తావన వచ్చిందని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సర్వేలో భారాసకు తక్కువ సీట్లు వస్తున్నాయని చెబితే నిఘా విభాగం మాత్రం ఎక్కువ సీట్లు వస్తున్నాయని ఎలా చెబుతుందని ప్రభాకర్‌రావును హరీశ్ అడిగినట్లు, దీనికి సంబంధించి మరింత స్పష్టత కోసం తనతో మాట్లాడమని ప్రభాకర్‌రావుకు సలహా ఇచ్చినట్లు శ్రవణ్‌రావు చెప్పినట్లు తెలుస్తోంది. శ్రవణ్‌రావు తన ఛానల్ సిబ్బంది ద్వారా పోటీతీవ్రంగా ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో అప్పటి ప్రతిపక్షం తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారికి సహకరిస్తున్న వారి ఫోన్ నంబర్లు సేకరించి ప్రభాకర్‌రావుకు పంపేవారని, వీటిని ట్యాప్ చేయించి వారిని కట్టడి చేసేందుకు ఉపయోగించేవారని, ఇందులో ప్రణీత్‌రావు ప్రమేయమూ ఉందని సిట్ దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. హరీశ్-ప్రభాకర్‌రావులు కలుసుకున్న సందర్భంలోనే ఈ మొత్తం వ్యవహారానికి బీజం పడిందని సిట్ భావిస్తోంది. దీన్ని నిర్ధారించుకునేందుకే హరీశ్‌రావుకు నోటీసులిచ్చింది.

# ద్వైపాక్షిక వాణిజ్యం రూ.18 లక్షల కోట్లకు!

మొదటి పేజీ తరువాయి



గుజరాత్‌లోని ధొలెరాలో ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో యూఏఈ పెట్టుబడులు పెట్టనుంది. అధినేతలు ఇరువురూ తొలుత ఏకాంతంగా సమావేశమయ్యారు. రక్షణ మొదలుకుని వర్తకం, ఇంధనం, ప్రాంతీయ భద్రత తదితర అంశాలపై లోతుగా చర్చించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని వారు ముక్త కంఠంతో ఖండించారు. వాటికి ప్రోత్సాహం, ఆర్థిక మద్దతు ఇచ్చేవారిని కూడా శిక్షించాల్సిందేనని పునరుద్ఘాటించారు.

ఆహార భద్రత, వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం తదితరాలపై ఈ సందర్భంగా ఒప్పందాలు జరిగాయి. కృత్రిమ మేధ రంగంలో పరస్పరం మరింతగా సహకరించుకోవాలని నేతలు నిర్ణయానికి వచ్చారు. అనంతరం ఇరు దేశాల బృందాలు కూడా చర్చల్లో పాల్గొన్నట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ తెలిపారు. చర్చల వివరాలను ఆయన మీడియాకు వివరించారు.

ఇందుకోసం దుబాయ్ యువరాజు షేక్ హందాన్ బిన్ మొహమ్మద్ బిన్ మక్తోమ్, ఇతర రాజ కుటుంబీకులు, మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన భారీ బృందం నహ్యాన్‌తో పాటు వచ్చినట్టు ఆయన వివరించారు. అధినేతల సమక్షంలో ఇరు బృందాలు పలు ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నట్టు చెప్పారు. వ్యవసాయ రంగం ఒప్పందంతో భారత రైతులకు లబ్ధి చేకూరడంతో యూఏఈకి ఆహార భద్రత లభిస్తుందని మిస్రీ తెలిపారు. పౌర అణు ఇంధన రంగంలో భాగస్వామ్య అవకాశాలను ఇరుదేశాలు మరింతగా అన్వేషించనున్నట్టు చెప్పారు. అలాగే 'డేటా ఎంబసీ'ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలిస్తాయన్నారు.

తమ చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగినట్టు మోదీ పేర్కొన్నారు. నహ్యాన్‌ను తన సన్నిహిత మిత్రునిగా సంబోధించారు. ''విమానాశ్రయానికి వెళ్లి నా సోదరునికి స్వాగతం పలికా. భారత్, యూఏఈ మధ్య బలమైన మిత్ర బంధానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ పర్యటన అద్దం పడుతోంది''అంటూ ఎక్స్ పోస్టులో ప్రధాని పేర్కొన్నారు. ఇరుదేశాల నడుమ ఇప్పటికే కీలకమైన ఒప్పందాలెన్నో కుదిరాయి. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, స్థానిక కరెన్సీలోనే చెల్లింపుల వ్యవస్థ, ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం వంటివి వాటిలో ఉన్నాయి.

**పశ్చిమాసియాపైనే చర్చ?**

పశ్చిమాసియా ప్రాంతంలో నానాటికీ పెచ్చరిల్లుతున్న ఉద్రిక్తతలపైనే మోదీ, నహ్యాన్ ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. ఇరాన్‌లో ఆందోళనలు, నిరసనలు నానాటికీ మిన్నంటుతుండటం తెలిసిందే. వాటికి ఇప్పటికే కనీసం 5 వేల మందికి పైగా బలయ్యారు. అవసరమైతే ఇరాన్‌పై దాడికి కూడా వెనకాడబోమన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో ఉద్రిక్తతలు ఓ దశలో తారస్థాయికి చేరాయి. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం పూర్తిగా ముగియలేదు. వీటికి తోడు యెమన్ కారణంగా యూఏఈ కూడా సోదర దేశమైన సౌదీ అరేబియాపై ఇటీవలే కత్తులు దూయాల్సి వచ్చింది.

యెమన్‌లోని ముకల్లా పోర్టును యూఏఈ దన్నుతో స్థానిక సాయుధ గ్రూపు చెరబట్టడంతో సౌదీ ఆగ్రహించి ఆ పోర్టుపై క్షిపణి దాడులకు దిగింది. సౌదీ హెచ్చరికలతో యెమన్ నుంచి యూఏఈ తన సేనలను ఉపసంహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఫోన్లలో మాట్లాడేందుకు కుదరని పలు 'అత్యవసర'అంశాలపై చర్చల నిమిత్తమే నహ్యాన్ హుటాహుటిన భారత్ వచ్చినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అవేమిటన్నది మాత్రం సస్పెన్స్‌గానే మిగిలింది. పశ్చిమాసియా ప్రాంతంలో భారత్‌కు యూఏఈ అత్యంత సన్నిహిత మిత్ర దేశం. కరోనా సమయంలో భారత్ తక్షణం స్పందించి అత్యవసరమైన వ్యాక్సీన్లు తదితరాలను యూఏఈకి భారీగా సరఫరా చేసింది. నాటినుంచీ ఇరుదేశాల బంధం మరింత బలపడింది.

**ప్రయాణం 6 గంటలు... పర్యటన 1.45 గంటలు!**

నహ్యాన్ తాజా పర్యటనకు దౌత్య కోణంలో అత్యంత ప్రాధాన్యత ఉన్నట్టు చెబుతున్నారు. అయితే, ఈ పర్యటనలో విపరీతమైన ఆసక్తికి కారణంగా నిలిచిన విశేషం మరొకటుంది. అదేమిటంటే, నహ్యాన్ పర్యటన కేవలం అక్షరాలా గంటా నలభై ఐదు నిమిషాల పాటు మాత్రమే కొనసాగడం! అబుదాబి నుంచి ఢిల్లీకి విమాన ప్రయాణ సమయమే 3 గంటలకు పైగా ఉంటుంది. నహ్యాన్ సోమవారం సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు పాలెం విమానాశ్రయంలో దిగారు. 4.45కు మోదీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. తిరిగి సాయంత్రం 6 గంటల 5 నిమిషాలకు యూఏఈకి పయనమయ్యారు.

అంటే భారత్‌లో గడిపింది కేవలం 1.45 గంటలు. అందుకోసం రానూ పోనూ నహ్యాన్ 6 గంటలకు పైగా ప్రయాణం చేశారు! ఒక దేశాధినేత అధికారిక పర్యటన కేవలం ఇంత తక్కువ సమయం పాటు జరగడం అసాధారణమేనని దౌత్య నిపుణులు అంటున్నారు. ''నహ్యాన్ రాక ఏదో వేరే దేశ పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో జరిగిన బాపతు కాదు. కేవలం మోదీతో భేటీ అయ్యేందుకే ఆయన యూఏఈ నుంచి బయల్దేరి వచ్చారు. బహుశా అతి ముఖ్యమైన అంశంపై అత్యవసరంగా చర్చించాల్సిన అవసరమే ఇందుకు దారితీసి ఉంటుంది''అని వారు అభిప్రాయపడుతున్నారు. మోదీ ఆహ్వానం మేరకే నహ్యాన్ భారత పర్యటనకు వస్తున్నట్టు విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

**ఊయల ఊగారు!**

నహ్యాన్‌కు మోదీ బహుమతులు

యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌కు ప్రధాని మోదీ పలు అరుదైన కానుకలు అందజేశారు. గుజరాతీ కళాకారులు అత్యంత నైపుణ్యంతో తయారు చేసిన చెక్క ఊయల, కశ్మీర్‌కు చెందిన పష్మీనా శాలువా తదితరాలు వీటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా నేతలిద్దరూ సంప్రదాయ దుస్తుల్లో ఊయలపై కూర్చుని అలరించారు. కశ్మీరీ శాలువాను తెలంగాణలో తయారు చేసిన వెండి పెట్టెలో పెట్టివ్వడం విశేషం. నహ్యాన్‌తో పాటు వచ్చిన ఆయన తల్లి, ఇతర రాజకుటుంబ సభ్యులకు కూడా శాలువాలతో పాటు కశ్మీరీ కుంకుమ పువ్వు తదితరాలను మోదీ అందజేశారు.

# ఢిల్లీ హైకోర్టులో సెంగర్‌కు చుక్కెదురు



మొదటి పేజీ తరువాయి

స్టడీ మరణం కేసులో 2020 మార్చి 13న తనకు పడిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దుచేయాలన్న అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసును ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రవీందర్ దుదేజా సోమవారం విచారించారు. ''గతంలోనే దోషిగా తేలిన పిటిషనర్ ఇప్పటికే ఏడున్నర సంవత్సరాలు జైలు జీవితం పూర్తి చేసుకున్న విషయం మాక్కూడా తెలుసు. ఈ ఏడున్నరేళ్లలో ఆయన తన శిక్ష రద్దు కోసం పిటిషన్లను ధర్మాసనం వినలేదు. ఎందుకంటే ఆయన శిక్షను రద్దుచేయాలంటూ చాలాసార్లు మధ్యంతర పిటిషన్లు దాఖలుచేశారు. ఇవి చాలవన్నట్లు బెయిల్ పొడిగింపు కోసం ఇంకొన్ని, మొత్తం శిక్ష రద్దు కోరుతూ మరికొన్ని పిటిషన్లు వేశారు. ఇన్ని పిటిషన్లు దాఖలుచేయడం వల్లే అసలైన పిటిషన్ విచారణకు నోచుకోలేదు.

శిక్షరద్దు కోరుతూ వేసిన పిటిషన్‌లో ఎలాంటి పస లేదు. అందుకే ఆయన అభ్యర్థనను తిరస్కరిస్తున్నాం. గత శిక్ష రద్దుకు సంబంధించిన న్యాయ సూత్రాలు ఈయనకు వర్తించవు. ఈ ఉదంతంలో వాస్తవాలు, తదనంతర పరిణామాలను పరిగణనలోకి తీసుకుని పిటిషనర్ శిక్ష రద్దుకు మేం సమ్మతి నిరాకరిస్తున్నాం. మిగతా శిక్ష నుంచి పిటిషనర్‌కు మినహాయింపు ఇచ్చేందుకు ఎలాంటి బలమైన సహేతుక కారణాలు లేవు. ఏడున్నర సంవత్సరాల కారాగార శిక్ష అనుభవించిన పిటిషనర్‌కు కేసులో విచారణ ఆలస్యమైందన్న కారణంగా ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వలేం. ఈ అంశాన్ని ఫిబ్రవరి మూడో తేదీన తిరిగి విచారిస్తాం''అని జడ్జి చెప్పారు.

తీర్పుపై సంతోషం వ్యక్తంచేసిన బాధితురాలు

పదేళ్ల శిక్ష రద్దు అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించడంపై ఉన్నావ్ బాధితురాలు సంతృప్తి వ్యక్తంచేశారు. ''కోర్టు నిర్ణయంతో నేనెంతో సంతృప్తిగా ఉన్నా. మా నాన్న ఆత్మ కూడా శాంతిస్తుంది. దోషులందరికీ మరణశిక్ష అమలయ్యాకే నిజంగా ఆయన ఆత్మ శాంతిస్తుంది. ఇది కేవలం నా యుద్ధం కాదు. న్యాయం, సత్యం కోసం పోరాటం. నా తుది శ్వాసదాకా పోరాడతా''అని ఆమె వ్యాఖ్యానించారు. .

# అజ్ఞాతం వీడిన మావోయిస్టులకు ఆధార్



**గతేడాది 576 మంది లొంగుబాటు**

1980లో పీపుల్స్‌వార్(ప్రస్తుత మావోయిస్టు పార్టీ) ఆవిర్భవించిన అనంతరం ఎన్నడూ లేనిరీతిలో గతేడాది ఏకంగా 576 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరికి పునరావాస కార్యక్రమాల్లో భాగంగా ఎస్ఐబీ ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయితే వీరెవరికీ సరైన చిరునామాతోపాటు గుర్తింపు లేకపోవడంతో వాటి కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. అందులో భాగంగా తొలుత వారి స్వగ్రామాల్లో తహసీల్దార్ కార్యాలయాల ద్వారా నివాస ధ్రువపత్రం ఇప్పిస్తోంది. దానితో ఆధార్‌కు దరఖాస్తు చేయిస్తోంది. అనంతరం పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా తెరిపిస్తోంది. అదే ఖాతాలో వారి రివార్డు సొమ్ము జమ చేయిస్తోంది. కేంద్ర కమిటీ సభ్యులకు రూ.25 లక్షల చొప్పున, రాష్ట్ర కమిటీ సభ్యులకు రూ.20 లక్షలు, డివిజనల్ కమిటీ కార్యదర్శులకు రూ.8 లక్షలు, డివిజన్ కమిటీ సభ్యులకు/ఏరియా కమిటీ కార్యదర్శులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున అందజేస్తోంది. కోరుకున్నవారికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకూ ప్రయత్నిస్తోంది. అనారోగ్య కారణాలతో జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు వైద్యచికిత్సలు అందేలా ఎస్ఐబీ అధికారులు ఏర్పాట్లు చేశారు. పలువురికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించారు. ఓ రాష్ట్ర కమిటీ సభ్యుడికి కిడ్నీలు దెబ్బతినగా రూ.లక్ష వరకు వెచ్చించి చికిత్స అందించారు. మరో సభ్యుడి ఊపిరితిత్తులకు రూ.50 వేలకుపైగా వ్యయంతో చికిత్స చేయించారు.

# పండుగలప్పుడు ఛార్జీల పెంపా?

**ఈ-కబురు, న్యూఢిల్లీ:** పండుగల రద్దీని అవకాశంగా తీసుకుని విమాన ప్రయాణ ఛార్జీలను అమాంతంగా పెంచేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. చార్జీలను ఆకస్మిక పెంచి విమానయాన సంస్థలు సాగిస్తున్న దోపిడీపై జోక్యం చేసుకోక తప్పదని స్పష్టం చేసింది. ప్రైవేట్ విమానయాన సంస్థలు ఆకస్మికంగా పెంచుతున్న చార్జీలు, అదనపు రుసుములను నియంత్రించడానికి తగు మార్గదర్శకాలను రూపొందించాలంటూ దాఖలైన పిల్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది.

'మేం ఈ విషయంలో కచ్చితంగా జోక్యం చేసుకుంటాం. కుంభమేళా, ఇతర పండగల సమయాల్లో ప్రయాణి కులను ఎలా దోచుకుందీ చూశాం. తాజాగా, ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్, జోథ్‌పూర్‌లకు చార్జీలను ఆకస్మికంగా పెంచేశారు'అని ధర్మాసనం పేర్కొంది. విమాన ప్రయాణ చార్జీల్లో పారదర్శకత, ప్రయాణికుల హక్కుల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలంటూ సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణన్ వేసిన పిటిషన్‌పై గతేడాది నవంబర్ 17వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం..కేంద్రం, డీజీసీఏ తదితరులకు నోటీసులు జారీ చేసింది.

సోమవారం విచారణ సందర్భంగా సమాధానం ఇచ్చేందుకు మరింత గడువు కావాలని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్ కోరడంతో ధర్మాసనం తదుపరి విచా రణను ఫిబ్రవరి 23వ తేదీకి వాయిదా వేసింది. ఎకానమీ క్లాస్ ప్రయాణికులకు గతంలో 25 కిలోల వరకు లగేజీని ఉచితంగా తీసుకెళ్లే అవకాశం ఉండగా ప్రైవేట్ విమానయాన సంస్థలు దాన్ని 15 కిలోలకు ఏకపక్షంగా తగ్గించి వేశాయని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రస్తుతం విమాన చార్జీలను, ఇతర అదనపు రుసుములను సమీక్షించేందుకు గానీ, గరిష్ట పరిమితిని నిర్ణయించేందుకు గానీ అధికారం ఏ వ్యవస్థకూ లేకపోవడంతో విమానయాన సంస్థలు వివిధ రూపాల్లో ప్రయాణికులను దోచుకుంటున్నాయని ఆరోపించారు.



# కొత్త పార్టీ ఏర్పాటుపై వేగం పెంచిన కవిత



తెలంగాణ రాష్ట్ర స్థితిగతులు, సమగ్రాభివృద్ధి, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలు, వనరుల వినియోగంపై అధ్యయనం కోసం గతంలోనే కమిటీలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం ఆయా కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేస్తున్న అధ్యయనం గురించి వివరించి, ప్రాథమిక నివేదికను కమిటీ సభ్యులు సమర్పించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి అవసరమైన బ్లూప్రింట్ రూపొందించే పనిలో తెలంగాణ జాగృతి నాయకులు నిమగ్నమయ్యారు. రెండు, మూడు నెలల్లో నూతన రాజకీయ ఏర్పాటుపై మరింత స్పష్టత వస్తుందని జాగృతివర్గాలు తెలిపాయి.

**ప్రశాంత్ కిశోర్‌తో భేటీ?**

కొత్త పార్టీ ఏర్పాటు దిశగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సన్నద్ధమవుతున్న నేపథ్యంలో.. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఆమె భేటీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ ఏర్పాటు, ప్రజా సమస్యలపై పోరాటం, జనం కోణంలో పనిచేసే విధానం తదితర అంశాలపై ఆయనతో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు ప్రచారంలో ఉంది. ఈ విషయాన్ని జాగృతి వర్గాలు అధికారికంగా ధ్రువీకరించలేదు

# మార్కెట్‌ను ముంచిన టారిఫ్ భయాలు



నిఫ్టీ 108.85 పాయింట్ల నష్టంతో 25,585.50 వద్ద ముగిసింది. ట్రంప్ తాజా హెచ్చరికలకు తోడు నిరాశాపూరితమైన ఫలితాల కారణంగా కార్పొరేట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్ షేర్లలో భారీ అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. సర్వత్రా బలహీనత నేపథ్యంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.28%, మిడ్‌క్యాప్ సూచీ 0.43% నష్టపోయాయి. సెన్సెక్స్ షేర్లలో ఆర్ఐఎల్ గరిష్ఠంగా 3.04%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.26% నష్టపోయాయి.

**బీసీసీఎల్ లిస్టింగ్ సూపర్ హిట్**

కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) షేర్ల లిస్టింగ్ సూపర్ హిట్టయింది. ఇష్యూ ధర కన్నా ఈ షేరు 77% ప్రీమియంను నమోదు చేసింది. ఇష్యూ ధర రూ.23తో పోల్చితే 96.56% ప్రీమియంతో బీఎస్ఈలో రూ.45.21 వద్ద లిస్టయిన ఈ షేరు రూ.40.66 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 95.65% ప్రీమియంతో రూ.45 వద్ద లిస్టయిన ఈ షేరు చివరికి 76.43% ప్రీమియంతో రూ.40.58 వద్ద ముగిసింది.ఈ ధరలో కంపెనీ మార్కెట్ విలువ రూ.18,935.36 కోట్లుగా నిలిచింది

# మోటూరి నారాయణరావుకు కర్ణాటక, తెలుగు రైటర్స్ ఫెడరేషన్ లిటరరీ అవార్డు

ఈకబురు,శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు, తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, కవి, సీనియర్ జర్నలిస్టు మోటూరి నారాయణరావును కర్ణాటకకు చెందిన సంక్రాంతి లిటరరీ అవార్డ్ వరించింది. కర్ణాటక తెలుగు రైటర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులోని ఇండో ఏషియన్ అకాడమీ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి లిటరరీ అవార్డ్స్ 2026 కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా దక్షిణాది భాషా పండితులు,కవులు,రచయితలు హాజరైన మల్టీ లింగ్వల్ పోయిట్ మీట్ కు కవి మోటూరి నారాయణరావు హాజరయ్యారు.. ఈ సందర్భంగా కేటీఆర్ఎఫ్ అధ్యక్షుడు మాల్యాద్రి సారథ్యంలో బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, అస్సాం, కర్ణాటక,కేరళ తదితర రాష్ట్రాల నుంచి విచ్చేసిన కవుల సమక్షంలో మోటూరి నారాయణరావు లిటరరీ అవార్డ్ 2026 ను అందుకున్నారు. ఈ సందర్భంగా మోటూరి నారాయణరావు మాట్లాడుతూ.. అజంతా భాషగా అలరారే అందమైన తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాతృభాష అస్థిత్వాన్ని కోల్పోతే తెలుగు ఉనికి ప్రశ్నార్థకమవుతుందని వాపోయారు. పరభాషా వ్యామోహంలో పడి అమ్మ భాషను విడనాడటం మంచిది కాదన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. తెలుగు భాషాభిమానులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సాహిత్యాభ్యున్నతికి కృషి చేస్తున్న కర్ణాటక తెలుగు రైటర్స్ ఫెడరేషన్ సేవలను కొనియాడారు. సంక్రాంతి లిటరరీ అవార్డ్ అందించిన కార్య నిర్వాహక బృందానికి తెలుగు వెలుగు సాహిత్య వేదిక తరపున కృతజ్ఞతలు తెలిపారు.



రైటర్స్ ఫెడరేషన్ లిటరరీ అవార్డును అందుకుంటున్న నారాయణరావు

# బీజేపీ సారథిగా నితిన్ నబీన్



పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నితిన్ నబీన్‌కు మద్దతుగా వివిధ రాష్ట్రాల పార్టీ అధ్యక్షుల నేతృత్వంలో, పార్టీ ముఖ్యనేతలు నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్లను దాఖలు చేయగా మొత్తం 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. బరిలో ఒక్కరే ఉండటంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవంగా ఖరారు కాగా, అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. మంగళవారం ఉదయం 11.30గంటల తర్వాత పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ముఖ్యనేతల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ రిటర్నింగ్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌తో కలిసి బీజేపీ నూతన అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. నితిన్ నబీన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ తెలుగు రాష్ట్రాల బీజేపీ నేతలు నామినేషన్ పత్రాలు సమర్పించారు. తెలంగాణ బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య నామినేషన్ పత్రాలను లక్ష్మణ్‌కు అందజేశారు. ఉమ్మడి బిహార్‌లోని రాంచీలో పుట్టిన నితిన్ నబీన్ తొలుత బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇంటర్‌మీడియట్ చదివిన ఆయన బీజేపీ తరఫున కొన్ని రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. బిహార్ బాంకీపూర్ నుంచి వరుసగా 4సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. బిహార్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాకు ఎదిగిన తొలి నేత నితిన్ నబీన్.

# ఒప్పో నూతన మోడల్ రెనో 15 సిరీస్ ఆవిష్కరణ

ఇంటెలిజెంట్ ఏఐ, హోలో ఫ్యూజన్ ప్రో టెక్నాలజీతో రెనో 15 సిరీస్



కొత్త ఒప్పో రెనో 15 సిరీస్

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రముఖ మొబైల్ సంస్థ ఒప్పో ఇండియా తన ప్రీమియం వెర్షన్ రెనో15 సిరీస్‌ను సోమవారం ఆవిష్కరించింది. సోమవారం హైటెక్ సిటీలో జరిగిన కార్యక్రమంలో ఒప్పో ఇండియా కమ్యూనికేషన్స్ హెడ్ గోల్డీ పట్నాయక్ రెనో 15 సిరీస్ లోని మూడు వేరియంట్ లను విడుదల చేశారు. ఒప్పో కొత్త మోడల్ రెనో15, రెనో15 ప్రో మినీ, రెనో15 ప్రో.. మూడు వేరియంట్‌లతో అందుబాటులోకి వచ్చింది. యువ ప్రయాణికులు, ఫోటోగ్రఫీ ఇష్టపడే వారిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ సిరీస్ లో ఆధునిక కెమెరా సిస్టమ్, ఇంటెలిజెంట్ ఏఐ, ఆకర్షణీయమైన డిజైన్ కలిగి ఉన్నాయి. ప్రకృతి అంశాల ఇన్స్పిరేషన్ తో కలర్ ఫినిష్ తో పాటు ప్రపంచంలో తొలి హోలో ఫ్యూజన్ ప్రో టెక్నాలజీతో రెనో 15 సిరీస్ అందుబాటులోకి తీసుకువచ్చారు. రెనో 15 ప్రో, రెనో 15 ప్రో మినీ మోడళ్లు 200 ఎంపీ కెమెరాతో ఫోటోగ్రఫీని కొత్త స్థాయికి తీసుకెళ్లి అద్భుతమైన క్లారిటీని అందించనున్నాయి. 50ఎంపీ 3.5x ఆప్టికల్ జూమ్ లెన్స్, 120x డిజిటల్ జూమ్ ప్యూర్ టోన్ ఇమేజింగ్ టెక్నాలజీ, ఏఐ ఎడిటింగ్ టూల్స్ సపోర్టుతో తీర్చిదిద్దారు. రెనో15 సిరీస్ విడుదల సందర్భంగా ఒప్పో ఇండియా కమ్యూనికేషన్స్ హెడ్ గోల్డీ పట్నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో 100 మిలియన్లకు పైగా ఒప్పో యూజర్లు ఉన్నారని, వినియోగదారుల అంచనాలు ప్రీమియం అనుభవాల వైపుకు మారుతున్నాయని గమనించామన్నారు. వినియోగదారులు కేవలం చిన్నపాటి మార్పుల కంటే, తమ రోజువారీ జీవితంలో నిజంగా ఉపయోగపడే ఫీచర్లనే కోరుకుంటున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రెనో15 సిరీస్‌లో అత్యుత్తమ ఇమేజింగ్ సిస్టమ్, లేటెస్ట్ ఏఐ టెక్నాలజీ, మొదటి హోలో ఫ్యూజన్ టెక్నాలజీ వంటి లేటెస్ట్ ఫీచర్లతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.



ఒప్పో రెనో 15 సిరీస్ మోడల్ ను ఆవిష్కరిస్తున్న గోల్డీ పట్నాయక్

# సంపదను పెంచి..
# పేదలకు పంచుతాం

రాష్ట్రంలో సంపదను పెంచి.. పేదలకు పంచుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాప్రభుత్వం రెండేళ్లలో రూ.74,163 కోట్లను పలు పథకాల ద్వారా రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం వందనం గ్రామంలో రూ.35 కోట్ల అంచనాతో కొదుమూరు-వందనం ఎత్తిపోతల పథకం ఫేజ్-2 నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రాన్ని ఎట్టిపరిస్థితుల్లో రాబందుల పాలుగాకుండా చూస్తాం. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే.. 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ ఎత్తిపోతల పథకాల ద్వారా 1.98 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగేలా ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటి వరకూ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి రూ.47,710 కోట్లు ఖర్చు చేశాం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకుంటే తక్షణమే చెల్లింపులు చేస్తాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.26 వేల కోట్లను వడ్డీ లేని రుణాల కింద తిరిగి అందజేశాం' అని భట్టి పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యం, సర్పంచి ఆవుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# కశ్మీర్ అగ్గికి ఆజ్యం పోయొద్దు



దిల్లీ: ఉగ్రవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించాలని, భారత్ పొరుగున పాకిస్థాన్ రేపుతున్న కశ్మీర్ అగ్గికి ఆజ్యం పోయరాదని పోలండ్‌కు భారత్ స్పష్టం చేసింది. సోమవారం దిల్లీలో ఆ దేశ ఉప ప్రధాని, విదేశాంగశాఖ మంత్రి రాడోస్లావ్ సికోర్ స్కీ తనతో సమావేశమైన సందర్భంగా మన విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. గత అక్టోబరులో సికోర్ స్కీ పాకిస్థాన్‌ను సందర్శించి ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో చర్చలు జరిపారు. ఆ తర్వాత విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో కశ్మీర్ సమస్య గురించి ప్రస్తావించారు. దీనిపై అప్పట్లోనే భారత్ నిరసన వ్యక్తం చేసింది. సికోర్ స్కీ.. ఇప్పుడు భారత్‌లో 3 రోజుల పర్యటన కోసం వచ్చారు. ఈ సందర్భంగా జైశంకర్ ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావించారు. కశ్మీర్ అగ్గికి పోలండ్ ఆజ్యం పోయకూడదని కోరారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని పురస్కరించుకుని భారత్‌ను పాశ్చాత్య దేశాలు లక్ష్యంగా చేసుకున్నాయని, రష్యా చమురును దిగుమతి చేసుకోరాదంటూ ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. భారత్‌పై ఇలా అన్యాయంగా గురి పెట్టడం సరి కాదని సికోర్ స్కీ అభిప్రాయపడ్డారు. భారత్, పోలండ్‌ల మధ్య వ్యాపార సంబంధాలు వృద్ధి చెందుతున్నాయని, ఆ దేశంలో భారత్ పెట్టిన 300 కోట్ల డాలర్ల పెట్టుబడులు ఉపాధి అవకాశాలను పెంచాయని జైశంకర్ గుర్తు చేశారు.



# ప్రజా విశ్వాసాన్ని బలోపేతం చేయాలి

లఖ్‌నవూ: శాసన నిర్మాణ వేదికలపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం నొక్కిచెప్పారు. ఈ వేదికల్ని మరింత విశ్వసనీయమైనవిగా, జవాబుదారీతనం కలిగినవిగా తీర్చిదిద్దే బాధ్యత సభాపతులపైన, ప్రజాప్రతినిధులపైన ఉందని ఆయన అన్నారు. ప్రత్యక్ష ప్రసారాలు, డిజిటీకరణల సాయంతో సభా కార్యకలాపాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే అవకాశం వచ్చినా ఇంకా అనేక సవాళ్లను పరిష్కరించాల్సి ఉందని ఆయన 86వ అఖిల భారత సభాపతుల సమ్మేళనంలో ప్రసంగిస్తూ అన్నారు. "మనందరం భిన్న రాజకీయ పార్టీలకు చెందినవాళ్లం. మన భావజాలాలు కూడా విభిన్నమైనవే. అయితే మనల్ని ఎన్నుకున్న ప్రజలు మాత్రం వారి సమస్యలపై మనం సభలో మాట్లాడతామని ఆశిస్తారు" అని ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంలో జరిగే చర్చల సాయంతో సభాపతులు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని మరింత జవాబుదారీతనం కలిగిన వేదికలుగా తీర్చిదిద్దుతారని, ఫలప్రదమైనవిగా మారుస్తారని ఆశిస్తున్నా అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# అధిక వెయిటేజీ షేర్లలో విక్రయాలు

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,262.82 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు: రూ.4,234.30 కోట్లు**

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి అధిక వెయిటేజీ ఉన్న షేర్లలో అమ్మకాలతో సూచీలు సోమవారం నష్టపోయాయి. పెరుగుతున్న రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ టారిఫ్ ఆందోళనలు ప్రభావం చూపాయి. కొన్ని కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు అంచనాలు అందుకోలేకపోవడం, బలహీన రూపాయి కూడా మదుపర్లను అమ్మకాల వైపు నడిపించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు నష్టపోయి 90.90 వద్ద ముగిసింది. ఒకదశలో 91ని మించింది కూడా. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.22% తగ్గి 63.35 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై సూచీలు సానుకూలంగా, జపాన్, హాంకాంగ్ సూచీలు ప్రతికూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.16 లక్షల కోట్లు తగ్గి, రూ.465.68 లక్షల కోట్ల (5.12 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 83,494.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,570.35 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. 83,539.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, తర్వాత విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 82,898.31 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 324.17 పాయింట్ల నష్టంతో 83,246.18 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 108.85 పాయింట్లు కోల్పోయి 25,585.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,653.3025,494.35 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 14 నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.04%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.26%, ఎటర్నల్ 2.19%, టీసీఎస్ 1.36%, అదానీ పోర్ట్స్ 1.34%, టైటన్ 1.31% తగ్గాయి. ఇండిగో 4.30%, టెక్ మహీంద్రా 2.85%, హెచ్‌యూఎల్ 2.27%, బజాజ్ ఫైనాన్స్ 2.18%, మారుతీ సుజుకీ 2.04%, కోటక్ బ్యాంక్ 2.02%, ట్రెంట్ 1.16%, ఐటీసీ 1.11%, హెచ్‌సీఎల్ టెక్ 1.02%, యాక్సిస్ బ్యాంక్ 1% చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి, ఇంధన, చమురుగ్యాస్, టెలికాం, యుటిలిటీస్, మన్నికైన వినిమయ వస్తువుల సూచీలు డీలాపడ్డాయి. ఎఫ్ఎంసీజీ, వాహన, భారీ యంత్ర పరికరాలు, సేవల రంగ సూచీలు రాణించాయి. బీఎస్ఈలో 1,186 షేర్లు సానుకూలంగా, 3,116 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 181 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. అగ్రిప్రాసెసింగ్, రైస్ మిల్లర్ హల్దెర్ వెంచర్ లిమిటెడ్ ఎన్ఎస్ఈలో నమోదైంది. శుక్రవారం బీఎస్ఈలో రూ.259.60 వద్ద ముగిసిన షేరు, ఎన్ఎస్ఈలో 5 శాతం అప్పర్ సర్క్యూట్‌తో నమోదై రూ.272.35 వద్ద ముగిసింది.

**ఫలితాల నేపథ్యంలో....** ఐసీఐసీఐ బ్యాంక్ త్రైమాసిక ఫలితాలు మదుపర్లను మెప్పించకపోవడంతో, బీఎస్ఈలో షేరు 2.26% నష్టపోయి రూ.1,379.80 వద్ద ముగిసింది. ఒక దశలో 3.65% తగ్గి రూ.1,360 స్థాయినీ తాకింది. మార్కెట్ విలువ రూ.22,566.78 కోట్లు తగ్గి, రూ.9,86,857.93 కోట్లకు పరిమితమైంది.రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు బీఎస్ఈలో 3.04% తగ్గి రూ.1,413.25 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 3.72% క్షీణించి రూ.1,403.30 స్థాయిని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.60,016.51 కోట్లు తగ్గి రూ.19,12,476.70 కోట్లకు పరిమితమైంది.విప్రో షేరు బీఎస్ఈలో 7.95% తగ్గి రూ.246 వద్ద ముగిసింది. ఒక దశలో 9.54% తగ్గి రూ.241.75 స్థాయినీ తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.22,282.64 కోట్లు తగ్గి, రూ.2,57,977.45 కోట్లకు పరిమితమైంది.టెక్ మహీంద్రా షేరు బీఎస్ఈలో 2.85% పెరిగి రూ.1,718.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 3.95% పెరిగి రూ.1,736.55 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయినీ తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,685.14 కోట్లు పెరిగి రూ.1,68,325.92 కోట్లుగా నమోదైంది.

**భారత్ కోకింగ్ కోల్ షేరు అదుర్స్....** కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ స్టాక్ మార్కెట్‌లో శుభారంభం చేసింది. ఇష్యూ ధర రూ.23తో పోలిస్తే, 96.56% ప్రీమియంతో బీఎస్ఈలో రూ.45.21 వద్ద ఈ షేరు నమోదైంది. చివరకు 76.78% లాభంతో రూ.40.66 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.18,935.36 కోట్లుగా నమోదైంది.

# హీరో స్ప్లెండర్ కొత్త ధరలు



మూడు దశాబ్దాలకు పైగా భారత మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన హీరో స్ప్లెండర్ బైక్ ధరలు పెరిగాయి. కొత్త ఏడాది ఇతర కంపెనీల బాటలోనే హీరోమోటోకార్ప్ అడుగులు వేస్తూ.. ధరలను కేవలం రూ. 250 మాత్రమే పెంచింది. పెరుగుతున్న విడిభాగాల ధరలు, ఇతరత్రా కారణాల వల్ల ధరను పెంచడం జరిగిందని సంస్థ పేర్కొంది. హీరో స్ప్లెండర్ ప్లస్ భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన కమ్యూటర్ మోటార్‌సైకిల్‌గా తన స్థానాన్ని నిలుపుకుంది. ఇందులోని 100 సీసీ ఎయిర్ కూల్డ్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ 7.09 bhp & 8.05 Nm టార్క్‌ను అందిస్తుంది. ఇది 4స్పీడ్ కాన్స్టాంట్ మెష్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. కంపెనీ ఈ బైక్ ధరలను పెంచింది. కానీ డిజైన్, ఫీచర్స్, ఇంజిన్ వంటి వాటిలో ఎలాంటి మార్పు చేయలేదు. ముందు భాగంలో అదే టెలిస్కోపిక్ ఫోర్క్, వెనుక భాగంలో ట్విన్‌షాక్ అబ్జార్బర్‌లు ఉన్నాయి. ధరల పెరుగుదల తరువాత హీరో స్ప్లెండర్ డ్రమ్ వేరియంట్ ధర రూ. 73,902 నుంచి రూ. 74,152 వద్దకు చేరింది. ఐ3ఎస్ వేరియంట్ రూ. 75,055 నుంచి రూ. 75,305 వద్దకు, ఎక్స్‌టెక్ ధర రూ. 77,428 నుంచి రూ. 77,678 వద్దకు, ఎక్స్‌టెక్ 2.0 (డ్రమ్) వేరియంట్ ధర రూ. 79,964 నుంచి రూ. 80,214 వద్దకు, ఎక్స్‌టెక్ 2.0 (డిస్క్) వేరియంట్ ధర రూ. 80,471 నుంచి రూ. 80,721 వద్దకు చేరింది.

# పీఎన్‌బీ లాభం రూ.5,100 కోట్లు




ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 202526 అక్టోబరుడిసెంబరులో రూ.5,100 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభాన్ని ఆర్జించడం ఇదే తొలిసారి. 202425 ఇదే కాల లాభం రూ.4,508 కోట్లతో పోలిస్తే ఇది 13% అధికం. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,752 కోట్ల నుంచి రూ.37,253 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.31,340 కోట్ల నుంచి రూ.32,231 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం రూ.11,032 కోట్ల నుంచి 4.5% తగ్గి రూ.10,533 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ లాభం రూ.6,621 కోట్ల నుంచి రూ.7,481 కోట్లకు పెరిగింది.బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.09% నుంచి 3.19 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.41% నుంచి 0.32 శాతానికి మెరుగయ్యాయి. అయినా కేటాయింపులు రూ.318 కోట్ల నుంచి రూ.1,341 కోట్లకు పెరిగాయి. 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈసీఎల్ (ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్) నిబంధనలను చేరుకోవడానికి రూ.955 కోట్ల అదనపు కేటాయింపులు చేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర వెల్లడించారు. ఇకపై ప్రతి త్రైమాసికంలో రూ.5,000 కోట్ల నికర లాభం లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసిన ఒక పెద్ద ఖాతా నుంచి భారీ మొత్తం వసూలు కావడంతో రికవరీ రూ.823 కోట్ల నుంచి రూ.1,956 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. వొడాఫోన్ ఐడియాకు గతంలో మంజూరు చేసిన రూ.300 కోట్ల రుణం బకాయిలుగా ఉందని, ప్రస్తుతం ఆ సంస్థకు కొత్తగా రుణాలు మంజూరు చేయలేదని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.82.9 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. 2025 డిసెంబరు 31 నాటికి బ్యాంక్ కేటాయింపుల కవరేజీ నిష్పత్తి (సాంకేతిక రైటాఫ్‌లతో కలిపి) 96.77% నుంచి 96.99 శాతానికి మెరుగైంది. బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.26,39,991 కోట్ల నుంచి 9.5% పెరిగి రూ.28,91,528 కోట్లకు చేరింది. ఆస్తులపై ప్రతిఫలం (ఆర్ఓఏ) 1.03% నుంచి 1.06 శాతానికి మెరుగైంది. కనీస మూలధన నిష్పత్తి (సీఏఆర్) 15.41% నుంచి 16.77 శాతానికి పెరిగింది. 202526 ఆర్థిక సంవత్సరం 3 త్రైమాసికాల్లో (ఏప్రిల్‌డిసెంబరు) కలిపి బ్యాంక్ నికర లాభం రూ.11,679 కోట్లకు తగ్గింది. 202425 ఇదే కాలంలో ఈమొత్తం రూ.12,063 కోట్లుగా ఉంది.

# 2030కి 'ఎగువ మధ్య ఆదాయ దేశం'గా భారత్

**–రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరణ**

**–చైనా 2007 నాటి ఆర్థిక స్థితిలో ఇప్పుడు మనమున్నాం**

**–ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి**




భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకెళ్తోంది. ప్రస్తుత వృద్ధి రేటు వేగం ఇలాగే కొనసాగితే, తలసరి ఆదాయమూ గణనీయంగా పెరిగి.. 2030 నాటికి భారత్ ఎగువ మధ్య ఆదాయ (అప్పర్ మిడిల్ ఇన్‌కం) దేశాల జాబితాలో చేరుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. 2028 నాటికి జర్మనీని వెనక్కి నెట్టి.. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని స్పష్టం చేసింది. 1990 నుంచి ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల ఆదాయ స్థాయిల్లో వచ్చిన మార్పులు, భారత తలసరి ఆదాయంలో వస్తున్న పెరుగుదలను విశ్లేషిస్తూ ఈ నివేదికను రూపొందించారు.

**స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి....** స్వాతంత్ర్యం వచ్చాక.. మన జీడీపీ 1 ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్లకు చేరుకోవడానికి 60 ఏళ్లు పట్టింది. ఆ తర్వాత 7 ఏళ్లలోనే (2014 నాటికి) 2 ట్రిలియన్ డాలర్లు, మరో 7 ఏళ్ల (2021)లో 3 ట్రిలియన్ డాలర్ల స్థాయిని మించింది. 2025లో 4 ట్రిలియన్ డాలర్ల (రూ.360 లక్షల కోట్ల) స్థాయిని అధిగమించామని, 2027 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఈ జోరు ఇలాగే కొనసాగితే 2035 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.900 లక్షల కోట్ల) భారీ స్థాయికి చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది. ప్రపంచ వృద్ధి పంపిణీలో భారత్ స్థానం గత 25 ఏళ్లలో 92వ పర్సంటైల్ వద్ద ఉండగా, 2024తో ముగిసిన దశాబ్దంలో అది 95వ పర్సంటైల్‌కు చేరింది. అంటే, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది.

**తలసరి ఆదాయం పెరుగుతోంది....** దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)తో పాటే, ప్రజల తలసరి ఆదాయమూ గణనీయంగా పెరుగుతోంది. 1962లో 90 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2007కు 910 డాలర్లకు చేరింది. స్వాతంత్ర్య సమయంలో అల్పాదాయ దేశంగా ఉండగా, దిగువ మధ్య ఆదాయ దేశంగా మారేందుకు మనదేశానికి 60 ఏళ్లు పట్టింది. 2009లో 1,000 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2019 కల్లా 2,000 డాలర్లకు చేరింది. తాజా అంచనాల ప్రకారం 2026 నాటికి ఇది 3,000 డాలర్లకు, 2030 నాటికి 4000 డాలర్ల స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ బ్యాంకు ప్రమాణాల ప్రకారం, తలసరి ఆదాయం 4,500 డాలర్లు దాటితే ఆ దేశాన్ని ఎగువ మధ్య ఆదాయ దేశంగా పరిగణిస్తారు. భారత్ రాబోయే కొన్నేళ్లలోనే ఈ మైలురాయిని కచ్చితంగా చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది.

**'వికసిత్ భారత్' లక్ష్యంగా....** స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్లకు.. అంటే 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా విధించుకుంది. అంటే, అధిక ఆదాయ దేశంగా మారాల్సి ఉంటుంది. ప్రపంచ బ్యాంకు ప్రస్తుత ప్రమాణాల ప్రకారం అధిక ఆదాయ దేశంగా మారాలంటే తలసరి ఆదాయం 13,936 డాలర్లుగా ఉండాలి. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ తలసరి ఆదాయం ఏటా 7.5% సగటు వార్షిక వృద్ధి రేటును నమోదు చేయాలి. గత 23 ఏళ్లలో (20012024) భారత్ ఇప్పటికే 8.3% వార్షిక వృద్ధిని సాధించింది. కాబట్టి, ఈ లక్ష్యం చేరుకోవడం సాధ్యమేనని ఎస్‌బీఐ పేర్కొంది. ఒకవేళ 2047 నాటికి అధిక ఆదాయ పరిమితి 18,000 డాలర్లకు పెరిగితే, భారత్ 8.9% వృద్ధి రేటును సాధించాల్సి ఉంటుంది. ఇందుకోసం నామినల్ జీడీపీ వృద్ధి రేటు డాలర్ల రూపంలో ఏటా సుమారు 11.5% ఉండాలని నివేదిక సూచించింది. గతంలో (20042020 ఆర్థిక సంవత్సరాలు) భారత్ 11% వృద్ధిని నమోదు చేసిన చరిత్ర ఉండటం ఇక్కడ సానుకూల అంశం.

**భారీ వృద్ధికి సిద్ధంగా....** 2007లో చైనా తలసరి ఆదాయం 2,555 డాలర్లుగా ఉండేది. 2023లో భారత్ తలసరి ఆదాయం 2,580 డాలర్ల వద్ద ఉంది. అంటే, ఆర్థిక పరిణామ క్రమంలో

# కొండెక్కిన వెండి.. పరుగాపని పసిడి

**–కిలో సిల్వర్ రూ.3.09 లక్షలు**

**–3 నెలల్లోనే రెట్టింపయిన ధర**

బంగారం, వెండి ధరలు చుక్కలను తాకుతున్నాయి. ధరల పెరుగుదలలో బంగారాన్ని మించి, వెండి దూసుకుపోతోంది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎక్స్ఛేంజీలతో పాటు విక్రయశాలల్లోనూ ఈ లోహాల ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరుతున్నాయి. తొలిసారిగా దేశీయ విపణిలో కిలో వెండి ధర రూ.3 లక్షలను మించింది. ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ కాస్త బలహీనపడటం, గ్రీన్‌లాండ్ స్వాధీనానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడుగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో.. సురక్షితమని భావిస్తూ బంగారం, వెండిపైకి పెట్టుబడులు రావడమే వీటి ధరలు గణనీయంగా పెరగడానికి కారణమని బులియన్ వర్తకులు చెబుతున్నారు. కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతోంది.అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రాత్రి 11.55 గంటలకు కిలో వెండి ధర రూ.3,09,700 వద్ద, 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,49,300 వద్ద స్థిరపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 82 డాలర్లు పెరిగి, 4678 డాలర్లకు, ఔన్సు వెండి ధర 4.5 డాలర్లు అధికమై 94.62 డాలర్లకు చేరడం వల్లే దేశీయంగానూ ధరలు ఇంతలా పెరిగాయి. ఎంసీఎక్స్‌లోకమొడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.3,05,000ను మించింది. 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,45,000 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇంతకుమించిన డిమాండ్ పెట్టుబడులు, పారిశ్రామిక రంగాల నుంచి వస్తోంది. కమొడిటీ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులు పెట్టినా, డెలివరీ తీసుకునే వారు తక్కువ కనుక, పెద్దగా ఇబ్బంది ఉండదు. అయితే వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలోకి వచ్చే పెట్టుబడులకు సమానంగా వెండిని ఆయా సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వెండి ధర పెరుగుదల నేపథ్యంలో, వెండి ఫండ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. అందుకు తగ్గట్టు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా పెట్టుబడులు పారిశ్రామిక రంగాల నుంచి వస్తున్న గిరాకీ కంటే 2,500 టన్నులు తక్కువగా వెండి ఉత్పత్తి అవుతోందని.. ఈ అంతరం మరింత పెరగొచ్చనే అంచనాలున్నాయి.




**బంగారం, వెండి తరవాతే అగ్రగామి కంపెనీలు....** బంగారం, వెండి ధరల దూకుడు ఫలితంగా, అంతర్జాతీయంగా అత్యధిక మార్కెట్ విలువ పరంగా అగ్రగామి కంపెనీలు కూడా వెనుకబడ్డాయి. ప్రపంచ స్వర్ణమండలి అంచనాల ప్రకారం అంతర్జాతీయంగా బంగారం నిల్వలు 2,16,225 టన్నులు, వెండి 17,51,000 టన్నులుగా పరిగణించి.. ప్రస్తుత ధరల ప్రకారం ఈ అంచనాలు ప్రకటిస్తున్నారు.

**20 రోజుల్లోనే.. రూ.70,000 పెరుగుదల....** ధరల పెరుగుదలలో వెండి దూకుడు కొనుగోలుదార్లకు ఆందోళన కలిగిస్తుండగా, పెట్టుబడిదార్లను మాత్రం ఆనందంలో ముంచెత్తుతోంది. ఈ నెలలోనే వెండి కిలో ధర రూ.2.40 లక్షల నుంచి రూ.3.09 లక్షలకు పైగా పెరిగింది. దీపావళి సమయంలో ధర బాగా పెరిగినా, పండగ తరవాత 2025 అక్టోబరు 27న కిలో వెండి ధర రూ.1.48 లక్షలకు దిగి వచ్చింది. తదుపరి మళ్లీ పెరుగుతూ వస్తోంది. 3 నెలలు కూడా గడవకముందే రెట్టింపునకు మించడం గమనార్హం.

# వృద్ధిరేటు అంచనాలు పెంచిన ఐఎంఎఫ్




మనదేశ వృద్ధిరేటు అంచనాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లో భారత స్థూల దేశీయోత్పత్తి 7.3 శాతంగా నమోదవ్వొచ్చని తాజాగా పేర్కొంది. గత అక్టోబరు అంచనాల్లో మన వృద్ధిరేటు 6.6 శాతంగా ఉండొచ్చని అంచనా వేసిన సంస్థ, 0.7% మేర పెంచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి, 202728కి వృద్ధిరేటు అంచనాను 6.2% నుంచి 6.4 శాతానికి పెంచింది. 202526 జులైసెప్టెంబరులో వృద్ధిరేటు 8.2% కావడంతో, ఏప్రిల్‌సెప్టెంబరులో జీడీపీ వృద్ధి 8 శాతంగా నమోదైందని గుర్తు చేసింది. 202526లో భారత్ ఆర్థిక వ్యవస్థ 7.4% వృద్ధిని నమోదు చేయొచ్చని గణాంకాల శాఖ ముందస్తు అంచనాల్లో పేర్కొంది. 202425లో వృద్ధిరేటు 6.5%గా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 3.3%: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాదిలో 3.3% వృద్ధి చెందొచ్చని ఐఎంఎఫ్ పేర్కొంది. 2025లో ఇంతే వృద్ధిరేటు నమోదైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాల ఉత్పత్తులపై విధించిన సుంకాల నేపథ్యంలో, అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి నెలకొంది. అయినా కూడా ఉత్తర అమెరికా, ఆసియా దేశాల్లో కృత్రిమ మేధ మీద పెట్టుబడులు భారీగా పెరగడంతో.. ప్రస్తుత ఏడాది (2026)లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 3.3%, 2027లో 3.2 శాతంగా నమోదు కావొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత అక్టోబరు అంచనాల ప్రకారం 2026లో ప్రపంచ వృద్ధి 3.1 శాతంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ పేర్కొంది. 2026, 2027 సంవత్సరాల్లో వర్ధమాన దేశాలు 4% కంటే అధిక వృద్ధిని నమోదు చేయొచ్చని అంచనా వేసింది

# బీమా విస్తరణకు వృద్ధి రేటు దోహదం



భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటం దేశీయ బీమా రంగానికి కలిసొస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి రేటు 7.3 శాతానికి చేరొచ్చని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ అంచనా వేసింది. బలమైన ఆర్థిక వృద్ధితో, ప్రజల సగటు ఆదాయాలు పెరుగుతాయని, ఇందువల్ల బీమా పాలసీలకు గిరాకీ అధికమవుతుందని తాజా నివేదికలో మూడీస్ తెలిపింది. దేశీయంగా నెలకొన్న సానుకూల పరిస్థితుల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌నవంబరులో మొత్తం బీమా ప్రీమియం ఆదాయం 17% పెరిగి, రూ.10.9 లక్షల కోట్లకు చేరింది. ఆరోగ్య బీమా ప్రీమియం 14%, జీవిత బీమా నూతన వ్యాపార ప్రీమియం 20% వృద్ధి చెందాయని మూడీస్ పేర్కొంది. 202425లో ప్రీమియం వసూళ్లలో వృద్ధి 7 శాతంగా (రూ.11.9 లక్షల కోట్లు) నమోదైంది. వినియోగదారుల్లో బీమా పాలసీలపై పెరిగిన అవగాహన, ఆర్థిక వ్యవస్థలో వేగవంతమైన డిజిటలీకరణ వల్ల, ఈ ఆర్థిక సంవత్సరంలో వేగవంత వృద్ధి కనిపిస్తోందని విశ్లేషించింది.ప్రభుత్వ రంగ బీమా సంస్థల లాభదాయకత పెంచేందుకు కేంద్రం పలు చర్యలు చేపట్టింది. ఎల్ఐసీలో వాటా విక్రయం, అండర్‌రైటింగ్ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకునే షరతుతో కొన్ని సంస్థలకు మూలధన సాయం, మరి కొన్నింటి విలీనం లేదా ప్రైవేటీకరణ వంటి ప్రతిపాదనలు పరిశ్రమపై ప్రభావం చూపిస్తున్నాయని మూడీస్ వివరించింది. బీమా కంపెనీల్లో ఎఫ్‌డీఐ పరిమితిని 74% నుంచి 100 శాతానికి పెంచడం వల్ల సంస్థలకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుందని మూడీస్ అభిప్రాయపడింది.

# పూజాని ఇబ్బంది పెట్టిన పాన్ ఇండియా హీరో ఎవరు?

హీరోయిన్ పూజా హెగ్డేకి అవకాశాలు దాదాపు తగ్గిపోయాయి. ఈమె నటించిన 'జన నాయగణ్' లెక్క ప్రకారం ఈ పాటికే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి వచ్చేయాలి. కానీ సెన్సార్ సమస్యల వల్ల అది ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ఇలాంటి టైంలో పూజా హెగ్డే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిపోయింది. దానికి కారణం ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలు. పాన్ ఇండియా హీరో తనతో అసభ్యంగా ప్రవర్తిస్తే, అతడిని లాగిపెట్టి కొట్టానని చెప్పంది. ఇంతకీ ఏంటి విషయం?

తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన పూజా హెగ్డే.. ఓ స్టార్ హీరోతో తనకెదురైన ఓ చేదు అనుభవాన్ని బయటపెట్టింది. 'నా కెరీర్ మొదట్లో ఓ భారీ పాన్ ఇండియా సినిమాలో ఛాన్స్ వచ్చింది. చాలా సంతోషంగా అనిపించింది. కానీ షూటింగ్ టైంలో ఓ రోజు.. ఆ హీరో, అనుమతి లేకుండా నా క్యారవాన్‌లోకి వచ్చేశాడు. అసభ్యంగానూ ప్రవర్తించాడు. చాలా ఇబ్బందిగా అనిపించింది. ఏం చేయాలో అర్థం కాలేదు. దీంతో ఆ హీరోని లాగిపెట్టి కొట్టాను. వెంటనే సదరు హీరో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత ఆ హీరోతో నటించడానికి నేను ఇష్టపడలేదు. దీంతో నా సీన్స్ అన్నీ డూపుని పెట్టి తీశారు' అని పూజ చెప్పకొచ్చింది.

మరి పూజా హెగ్డేని ఇబ్బంది పెట్టిన ఆ పాన్ ఇండియా హీరో ఎవరా అనేది ఇక్కడ క్వశ్చన్ మార్క్. కెరీర్ ప్రారంభంలో అంటే హృతిక్ రోషన్ 'మొహంజదారో'లో ఈమె నటించింది. దక్షిణాదిలోనూ ఈ మూవీ రిలీజైంది. నాలుగేళ్ల క్రితం ప్రభాస్ 'రాధేశ్యామ్'లో నటించింది. పూజా చేసిన పాన్ ఇండియా మూవీస్ అంటే ఇవే. మరి వీరిద్దరిలో ఎవరైనా పూజతో అసభ్యంగా ప్రవర్తించారా? లేదంటే ఈమె ఏమైనా కట్టుకథ చెబుతోందా అనేది ఇక్కడ అర్థం కావట్లేదు. ఇకపోతే పూజా చేతిలో ప్రస్తుతం కాంచన 4, దుల్కర్ సల్మాన్ తెలుగు సినిమా, ఓ హిందీ మూవీ ఉన్నాయి.




## అలాగైతే స్పెషల్ సాంగ్స్ అయినా ఓకే: రష్మిక

వరుస సినిమాలతోనే కాదు.. వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రేక్షకులకు ఎప్పుడూ దగ్గరగా ఉంటారు నటి రష్మిక (Rashmika). తాజాగా ఆమె ఓ చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలిచ్చారు. తనపై వచ్చిన రూమర్స్, తన సినిమాల గురించి పలు విషయాలను పంచుకున్నారు.

"నేను (Rashmika Mandanna) 2016 నుంచి ఇప్పటివరకూ ఒకేలా పని చేస్తున్నాను. ఎలాంటి భాషాపరమైన హద్దులు లేకుండా భిన్నమైన చిత్రాలను ఎంచుకుంటూ అలరిస్తున్నాను. ఇకపై కూడా అలానే ఉంటాను. అన్నిరకాల చిత్రాల్లో నటించాలని ఉంది. నేను హీరోయిన్‌ని. ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే నా పని. అందరికీ నచ్చే చిత్రాలు చేయడానికి ప్రయత్నిస్తుంటా. అందుకే కమర్షియల్, లవ్ స్టోరీ, స్త్రీ ప్రాధాన్యం ఉన్న చిత్రాలు.. ఇలా అన్నీ అంగీకరిస్తాను. కొందరికి ప్రేమ కథలు ఇష్టం.. మరికొందరికి కమర్షియల్ చిత్రాలంటే ఇష్టం. వాళ్లందరి కోసమే వైవిధ్యమైన కథలను ఓకే చేస్తుంటాను"

"వ్యూస్‌తో డబ్బులు సంపాదించడం కోసం నెగెటివిటీ సృష్టించి కొందరు మనపై ఏదేదో రాస్తారు. వాళ్లకు నిజంగానే నాపై కోపం ఉండొచ్చు.. దానికి ఇంకాస్త యాడ్ చేసి రాస్తుంటారు. నిజాయతీగా చెప్పాలంటే అలాంటి వార్తలు కూడా ఎంతోమందిని పోషిస్తున్నాయి. పోనీలే.. వాళ్లను కూడా బతకనీ అని వదిలేస్తా. ఇండస్ట్రీలో ఉన్నవారికి నెగెటివిటీ కామన్. అందుకే అందరి పైనా వార్తలు వస్తూనే ఉంటాయి. ఏదోఒకరోజు ప్రజలకు నిజం తెలుస్తుంది అని అనుకుంటా. కానీ, ఇప్పటివరకూ ఎవరూ మారలేదు. ఒకప్పుడు రూమర్స్ విని ఎంతో బాధ పడేదాన్ని. ఇప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నా. జీవితంలో జరిగిన ప్రతి విషయం నుంచి ఏదోఒకటి నేర్చుకుంటూ ముందుకుసాగుతున్నా" అని రష్మిక అన్నారు.

ఇక తన గురించి వచ్చే రూమర్స్‌లో ఒక దానిపై రష్మిక స్పష్టతనిచ్చారు. "ఇండస్ట్రీలో ఎక్కువ పారితోషికం తీసుకునే నటిని నేనే అని అందరూ అనుకుంటారు. అది అపోహ మాత్రమే. నేనేం హీరోని కాదు, ఎక్కువ తీసుకోవడానికి. అది నిజం అయితే బాగుండు అని నేనూ ఎదురుచూస్తున్నా. నేను ప్రత్యేక పాటల్లోనూ నటించడానికి సిద్ధంగా ఉన్నా. కాకపోతే ఆ చిత్రంలో నేనే హీరోయిన్ అయిఉండాలి. లేదంటే ఇండస్ట్రీలో ముగ్గురు దర్శకులు ఉన్నారు. వాళ్లు అడిగితే కచ్చితంగా లీడ్ రోల్ కాకపోయినా వాళ్ల సినిమాల్లో స్పెషల్ సాంగ్ చేస్తా" అని చెప్పారు. ఆ దర్శకులు ఎవరో మాత్రం ఆమె చెప్పలేదు.



## రూ.1300 కోట్ల కలెక్షన్స్..

## ఆ మూవీ నాగ్ చేయలేకపోయాడా?



మనది అని రాసుంటే ఎప్పటికైనా అది మన దగ్గరకే వస్తుంది. మనది కాకపోతే చేతుల వరకు వచ్చినా సరే దక్కకుండా చేజారిపోతుంది. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెబుతున్నామంటే టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జున.. ఓ అద్భుతమైన అవకాశాన్ని మిస్ చేసుకున్నారనే న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఒకవేళ ఆ ఛాన్స్ నాగ్ అందుకుని ఉంటే ఎలా ఉండేదా అని ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతకీ ఏంటి విషయం?

రీసెంట్ టైంలో ఊహించని సక్సెస్ అందుకున్న సినిమా 'ధురంధర్'. థియేటర్లలోకి వచ్చేంతవరకు దీనిపై పెద్దగా బజ్ లేదు. పాన్ ఇండియా రిలీజ్ కూడా కాదు. కేవలం హిందీ వెర్షన్ మాత్రమే విడుదల చేశారు. టికెట్ పెంపు లాంటివి అసలే లేవు. డిసెంబరు తొలివారంలో బిగ్ స్క్రీన్స్‌పైకి రాగా ఇప్పటికీ వసూళ్లు రాబడుతూనే ఉంది. ప్రస్తుతానికైతే రూ.1300 కోట్ల మేర వసూలు చేసింది. ఇందులో హీరో పాత్ర కంటే రహమాన్ డకాయిత్ అనే విలన్ పాత్రకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.రహమాన్ డకాయిత్‌గా అక్షయ్ ఖన్నా అద్భుతమైన ఫెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. అయితే తొలుత ఈ పాత్ర కోసం నాగార్జునని అనుకున్నారట. స్క్రిప్ట్ కూడా నచ్చింది గానీ అదే సమయానికి కూలీ, కుబేర చిత్రాలతో నాగ్ బిజీగా ఉండటం వల్ల చేజేతులా ఈ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందట. సినిమా చూసిన ప్రతిఒక్కరూ ఆ పాత్రలో అక్షయ్ తప్ప మరొకరిని ఊహించుకోలేరు. అంతలా అదరగొట్టేశారు. అలాంటి పాత్ర నాగార్జున చేసుంటే ఎలా ఉండేదో మరి?రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఆదిత్య ధర్ దర్శకుడు. 1990ల్లో పాకిస్థాన్ కరాచీలోని లయరీ అనే ప్రాంతంలో జరిగిన గ్యాంగ్ వార్స్, అక్కడికి వెళ్లిన ఓ భారత రహస్య ఏజెంట్.. తర్వాత ఏం జరిగింది? అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశారు. జనవరి 30 నుంచి ఇది నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కావొచ్చనే ప్రచారం నడుస్తోంది. మరోవైపు 'ధురంధర్' సీక్వెల్.. ఈ మార్చి 19నే థియేటర్లలోకి రానుంది. తొలి పార్ట్ హిందీ వరకే రిలీజ్ చేయగా.. సీక్వెల్ మాత్రం తెలుగుతో పాటు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేయనున్నారు.

## నటి శారదకు అత్యున్నత పురస్కారం



అభినేత్రి శారద పేరు తెలుగు పరిశ్రమలో ఎప్పటికీ చెరిగిపోని పేరు. ఆమె ఒక నట గ్రంథాలయం. ఆరు పదుల సినీ ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన పాత్రలకు జీవం పోశారు. 'కల్యాశుల్కం' చిత్రంతో వెండితెరకు పరిచమైన శారద.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో నటించి ఎనలేని అభిమానులను సంపాదించుకున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలని మన పెద్దలు చెబుతారు. అయితే, శారద మాత్రం ముందు రచ్చ గెలిచి ఆ తరువాతే ఇంట గెలిచారు. శారద తెలుగు నటే కానీ, మలయాళ చిత్ర పరిశ్రమలో స్టార్ రేంజ్‌కు చేరుకున్నారు. జాతీయ స్థాయి ఉత్తమ నటిగా పేరుపొందిన ఆమెకు పుట్టిల్లయిన తెలుగు చిత్ర పరిశ్రమ తన ప్రతిభకు పట్టాభిషేకం చేసింది. 'జేసీ డానియల్ అవార్డు 2024'కు శారద ఎంపిక తాజాగా కేరళ ప్రభుత్వం శారదను గౌరవించనుంది. మలయాళ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలకు గుర్తుగా కేరళ ప్రభుత్వం అందించే అత్యున్నత సినిమా పురస్కారం 'జేసీ డానియల్ అవార్డు 2024'కు ఆమె ఎంపికయ్యారు. జనవరి 25న తిరువనంతపురంలో కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని శారద అందుకుంటారు.


ఈ వార్త తెలిసిన వెంటనే శారద స్పందించారు. ఈ అవార్డ్‌కు తనను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తనపై మలయాళ చిత్రసీమతో పాటు అక్కడి ప్రేక్షకులు చూపిన ప్రేమను తన ఆఖరి శ్వాస వరకు మర్చిపోనని ఆమె అన్నారు. మలయాశ ప్రేక్షకులు లేకపోతే తన కెరీర్ లేదని పేర్కొన్నారు. తన సినీ కెరీర్ ఆరంభంలో తెలుగులో కొన్ని చిత్రాల్లో కామెడీ వేషాలు మాత్రమే దక్కాయని, ఆ పాత్రలు కూడా ఈ అమ్మాయికి సరిగా చేయడం లేదని చాలామంది మేకర్స్ అన్నారని గుర్తుచేసుకున్నారు.

## 2,500 మంది ఆర్టిస్టులతో వందేమాతరం..

## చాలా గర్వంగా ఉంది: కీరవాణి

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత కీరవాణి (M.M. Keeravani) అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయాన్ని ఆయన కంపోజ్ చేయనున్నారు. ఈ గేయం (Vande Matharam) 150 ఏళ్ల వార్షికోత్సవం నేపథ్యంలో జనవరి 26న జరగనున్న గణతంత్ర వేడుకలో కీరవాణి తన టీమ్‌తో కలిసి పాడనున్నారు. ఇది తనకెంతో గర్వకారణమని తెలుపుతూ ఆయన పోస్ట్ పెట్టారు.

"ఐకానిక్ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జనవరి 26న జరగనున్న గణతంత్ర దినోత్సవంలో దీన్ని ఆలపించనున్నా. ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నా. భారతదేశంలోని నలుమూలల్లో ఉన్న 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు. ఆరోజు కోసం ఎదురుచూస్తున్నాను" అని కీరవాణి ఎక్స్ వేదికగా తెలిపారు. 2,500 మంది కళాకారులు పాల్గొంటారని చెప్పడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. 1885లో బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గేయానికి గతేడాది నవంబర్ 7కు 150 ఏళ్లు పూర్తయిన విషయం తెలిసిందే.



## అలా చనిపోయే వాళ్ల ప్రాణాలకు విలువ లేదా: రేణూ దేశాయ్

కుక్క కాటు కారణంగా మనిషి చనిపోతే స్పందించే వ్యవస్థలు రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలపై ఎందుకు స్పందించడం లేదని రేణూ దేశాయ్ (Renu Desai) అన్నారు. వీధి కుక్కలను చంపడంపై నటి రేణూదేశాయ్, రష్మీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రోజుకు ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, వాళ్ల ప్రాణాలంటే లెక్కలేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. అందులో రష్మీ కూడా పాల్గొన్నారు. ఒక కుక్క కరుస్తోందని వందల కుక్కలను చంపడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"సమాజంలో చిన్నారులపై అత్యాచారాలు జరిగినప్పుడు ఎవరూ ఎందుకు స్పందించడం లేదు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో ఓ గ్రామ పంచాయతీ సర్పంచి వందల కుక్కలను చంపడం అమానవీయం కాదా. కుక్కలవి మాత్రం ప్రాణాలు కాదా? కుక్కే కాదు.. ఆవు, గేదె, పిల్లి, కోతి అన్నీ కూడా ప్రాణులే కదా?. మనుషులతోపాటు అన్ని ప్రాణులకు జీవించే హక్కు ఉంది. వీధి కుక్కల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం మన చుట్టూ ఉన్న అపరిశుభ్ర పరిస్థితులే. ఇంటా, బయటా చెత్త పేరుకుపోవడం వల్లే కుక్కలు పెరుగుతున్నాయి. అందుకు కారణమైన సమస్యలపై ఎవరూ స్పందించరు. కానీ, కుక్కల గురించే మాట్లాడతారు.. ఇదెక్కడి న్యాయం" అని రేణూదేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు."2019లో దోమ కాటు వల్ల నాకు డెంగీ వచ్చింది. చనిపోయినంత పని అయింది. ప్రభుత్వం అప్పుడు దోమల నివారణకు ఏం చేసింది. ఇటీవల వందల కుక్కలను చంపి వాటి పక్కన ఫొటోలు దిగారు. నిద్ర లేచిన దగ్గర నుంచి కాలభైరవుడిని పూజిస్తారు. మరోవైపు కుక్కలను చంపుతారు. కర్మ ఎవరినీ విడిచి పెట్టదు. ఎవడో ఒకడు అత్యాచారానికి పాల్పడ్డాడని మగవాళ్లందరినీ చంపేయలేం కదా. నేను ఇలా మాట్లాడినందుకు నన్ను జైలులో పెట్టనివ్వండి. ఫర్వాలేదు.. నేను చూసుకోగలను. ఈ దేశంలో ప్రతీది డబ్బుతో ముడిపడి ఉంది. బైకులు ఢీ కొట్టడం వల్ల రోజుకు వందల కుక్కలు గాయపడుతున్నాయి. అవి ఎవరి దగ్గరకు వెళ్లి కంప్లైంట్ చేయాలి"

"దోమల కాటు వల్ల లక్షల మంది చనిపోతున్నారు. వాళ్ల ప్రాణాలంటే లెక్క లేదా. ఈ ప్రెస్‌మీట్ వల్ల నాపై నెగెటివిటీ పెరుగుతుందని నాకు తెలుసు. అసభ్య పదాలతో తిడతారు. అయినా నేను భయపడను. దీని వల్ల కనీసం ఒక్కరైనా మారతారని నా ఆశ. ఈ సమస్య గురించి బయటకు వచ్చి మాట్లాడకపోతే ఆ భగవంతుడు క్షమించడు" అని రేణూ దేశాయ్ అన్నారు. "ప్రభుత్వ వ్యవస్థలు ఏం చేస్తున్నాయి. అవి పూర్తిగా విఫలం కావడం వల్లే కుక్కలు పెరిగిపోతున్నాయి. వీధి కుక్కలకు ప్రత్యేక షెల్టర్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలి. విదేశీ బ్రీడ్స్ పెంచుకునే యజమానులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి" అని రష్మీ అన్నారు.

**రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు: రేణూ దేశాయ్**

తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని రేణు దేశాయ్ స్పష్టం చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో తాను మీడియా వాళ్లపై కోపంతో కేకలు వేయలేదన్నారు. "ఓ 55 ఏళ్ల వ్యక్తి ఉద్దేశపూర్వకంగా నాపై గట్టిగా కేకలు వేశాడు. నన్ను కొట్టడానికి ప్రయత్నించాడు. అతడితో మాత్రమే నేను కోపంగా మాట్లాడాను. ఈ విషయాన్ని నా వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి కూడా కామెంట్స్ చేస్తున్నారు. ఇది ఎంతవరకు న్యాయం? దయచేసి అలా మాట్లాడకండి" అని రేణూ దేశాయ్ ఆ వీడియోలో కోరారు.




## హాఫ్ సెంచరీ ఎఫెక్ట్... 'గంభీర్ తాలూకా' అన్న మాజీనే ఇప్పుడు హర్షిత్‌ని పొగిడి



న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో భారత్ ఓడి సిరీస్‌ను 1-2తో చేజార్చుకుంది. అయితే, ఈ మ్యాచ్‌లో భారత యువ పేసర్ హర్షిత్ రాణా (52; 43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరవడం అందర్నీ ఆకట్టుకుంది. కోహ్లీకి హర్షిత్ మద్దతు ఇవ్వడం వల్ల టీమ్‌ఇండియా భారీ ఓటమిని తప్పించుకుంది. దీంతో రాణాపై ప్రశంసలు వర్షం కురుస్తోంది. ఒకప్పుడు హర్షిత్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ (Kris Srikkanth) సైతం ఈ కుర్రాడికి అభిమానిగా మారిపోయాడు. సెంచరీ చేసిన కోహ్లీని ప్రశంసించడంతోపాటు హర్షిత్‌ను ఆకాశానికెత్తాడు. "విరాట్ కోహ్లీ అద్భుతంగా ఆడాడు. ఓ వైపు వరుసగా వికెట్లు పడుతున్నా ఒత్తిడికి గురికాలేదు. నితీశ్ రెడ్డితో కలసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. తర్వాత క్రమంగా బ్యాట్ ఝుళిపించాడు. కానీ, రియల్ గేమ్ ఛేంజర్ హర్షిత్ రాణా (Harshit Rana). అతను బ్యాటింగ్ చేసిన తీరును చూసి న్యూజిలాండ్ ప్లేయర్లు వణికిపోయారు. హర్షిత్ బ్యాటింగ్ చూసి నేనూ ఆశ్చర్యపోయాను. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం అద్భుతం. అలవోకగా సిక్స్‌లు కొట్టడంతో ప్రత్యర్థి జట్టుకు ఏం చేయాలో తోచలేదు. హర్షిత్ హిట్టింగ్ న్యూజిలాండ్ ప్లేయర్లలో భయాన్ని కలిగించింది" అని క్రిస్ శ్రీకాంత్ వివరించాడు.

ప్రవారివల్లే టీమ్‌ఇండియాకు ఓటమి: సునీల్ గావస్కర్.... తనను టీమ్ మేనేజ్‌మెంట్ ఆల్‌రౌండర్‌లా చూడాలనుకుంటోందని హర్షిత్ రాణా ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బంతితోనే కాకుండా జట్టుకు అవసరమైనప్పుడు కొన్ని పరుగులు చేస్తూ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఎదగడానికి బాటలు వేసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా హర్షిత్.. కోచ్ గంభీర్ తాలూకా ప్లేయరంటూ శ్రీకాంత్ గతంలో విమర్శించిన విషయం తెలిసిందే.

## సబలెంక, అల్‌కరాజ్ బోణీ.. వీనస్ విలియమ్స్‌కు షాక్



టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ పెను సంచలనాలు లేకుండానే ప్రారంభమైంది. ఫేవరెట్స్ స్థాయికి తగ్గ ఆటతీరు కనబరిచి శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), ఏడో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ), 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఎనిమిదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న సబలెంకా తొలి రౌండ్‌లో 6-4, 6-1తో టియాంట్సోవా రకోటొమాంగా (ఫ్రాన్స్)పై గెలుపొందింది. ఈ మ్యాచ్‌ను టెన్నిస్ దిగ్గజాలు రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా) ప్రత్యక్షంగా తిలకించారు. 76 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరంభంలో తడబడింది.

**వెంటనే తేరుకుని...** తొలి మూడు పాయింట్లు కోల్పోవడంతోపాటు తన తొలి సర్వీస్ గేమ్‌ను చేజార్చుకుంది. అయితే వెంటనే తేరుకున్న రెండుసార్లు (2023, 2024) చాంపియన్, గత ఏడాది రన్నరప్ పదో గేమ్‌లో టియాంట్సోవా సర్వీస్‌ను బ్రేక్ చేసి తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో మాత్రం సబలెంకా జోరు పెంచగా... 'వైల్డ్ కార్డు'తో ఈ టోర్నీలో బరిలోకి దిగిన టియాంట్సోవా తేలిపోయింది. 23 విన్నర్స్ కొట్టిన సబలెంకా 20 అనవసర తప్పిదాలు కూడా చేసింది. మ్యాచ్ మొత్తంలో ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో పావోలిని 6-1, 6-2తో క్వాలిఫయర్ సస్నోవిచ్ (రష్యా)పై, స్వితోలినా 6-4, 6-1తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్)పై, 28వ సీడ్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్) 6-4, 6-1తో మనన్‌చాయ సావంగ్‌కె (థాయ్‌లాండ్)పై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

**వీనస్ తొలి రౌండ్‌లోనే అవుట్...**

మరోవైపు అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్‌తోపాటు 11వ సీడ్ అలెగ్జాండ్రోవా (రష్యా), 20వ సీడ్ మార్టా కొస్టుక్ (ఉక్రెయిన్), 26వ సీడ్ దయానా యాస్‌ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో ఆడిన అతి పెద్ద వయస్కురాలిగా రికార్డు నెలకొల్పిన 45 ఏళ్ల వీనస్ తీవ్రంగా పోరాడినా తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించలేకపోయింది.

రెండు గంటల 17 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో వీనస్ 7-6 (7/5), 3-6, 4-6తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడింది. ఇతర మ్యాచ్‌ల్లో క్వాలిఫయర్ జెనెప్ సోన్‌మెజ్ (టర్కీ) 2 గంటల 37 నిమిషాల్లో 7-5, 4-6, 6-4తో అలెగ్జాండ్రోవాపై, 3 గంటల 31 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ఎల్సా జాక్వెమోట్ (ఫ్రాన్స్) 6-7 (4/7), 7-6 (7/4), 7-6 (10/7)తో మార్టా కొస్టుక్‌పై, ఎలీనా గాబ్రియేలా రుస్ (రొమేనియా) 6-4, 7-5తో యాస్ట్రెమ్‌స్కాపై సంచలన విజయాలు నమోదు చేశారు.

**అల్‌కరాజ్ శుభారంభం...**

పురుషుల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), పదో సీడ్ బుబ్లిక్ (కజకిస్తాన్) తొలి రౌండ్‌లో నెగ్గి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను తొలిసారి గెలిచి 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకోవాలని భావిస్తున్న అల్‌కరాజ్ 6-3, 7-6 (7/2), 6-2తో ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.

# వారివల్లే టీమ్‌ఇండియాకు ఓటమి: సునీల్ గావస్కర్

న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను టీమ్‌ఇండియా 12తో కోల్పోయింది. ఇండోర్‌లో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక పోరులో భారత్ 41 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. స్వదేశంలో సిరీస్‌ను చేజార్చుకోవడంతో భారత జట్టుపై విమర్శలు వస్తున్నాయి. మూడో వన్డేలో భారత్ ఓడిపోవడానికి బ్యాటర్లు, బౌలర్లు కారణం కాదని.. ఫీల్డింగ్ వైఫల్యం వల్లే టీమ్‌ఇండియా ఓడిందని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. మిడిల్ ఓవర్లలో న్యూజిలాండ్ బ్యాటర్లు సులభంగా సింగిల్స్ తీయడంతో బౌలర్లకు ఇబ్బందికరంగా మారిందన్నారు. 'నేను ఎవరి పేర్లు చెప్పదలచుకోలేదు. కానీ, కొంతమంది వ్యక్తులు సింగిల్‌స్‌ను చాలా తేలికగా తీసుకోవడానికి అనుమతించారు. రోహిత్ శర్మ మైదానంలో చురుగ్గా ఉన్నాడు. కోహ్లీ గ్రౌండ్‌లో ఎంత వేగంగా ఉంటాడో మనందరికీ తెలుసు. కానీ, ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా (Team India) ఫీల్డింగ్ మరింత చురుగ్గా ఉంటే బాగుండేదని నాకు అనిపించింది. మన ఫీల్డర్లు ప్రభావవంతంగా ఫీల్డింగ్ చేయకపోవడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు సులభంగా సింగిల్స్ తీశారు. దీంతో బౌలర్లపై ఒత్తిడి పెరిగింది. మన ఫీల్డింగ్ వైఫల్యంతో డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ వంటి ప్లేయర్లు క్రీజులో పాతుకుపోయి అనవసరమైన రిస్క్‌లు తీసుకోకుండా పరుగులు రాబట్టారు' అని గావస్కర్ విశ్లేషించారు. మిచెల్, ఫిలిప్స్ మూడో వికెట్‌కు 219 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించారు. 338 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. కోహ్లీ (124), నితీశ్ రెడ్డి (53), హర్షిత్ రాణా (52) పోరాడినా టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు.



# ప్లే ఆఫ్స్‌కు బెంగళూరు

**డబ్ల్యూపీఎల్‌లో వరుసగా ఐదో విజయం**

**61 పరుగులతో గుజరాత్‌పై గెలుపు**

**మెరిపించిన గౌతమి నాయక్**

**కూల్చేసిన సయాలీ, డిక్లెర్క్**



వడోదర: బెంగళూరు... అదే జోరు! నవీ ముంబైలో ఇప్పటికే ముంబై, యూపీ, ఢిల్లీ, గుజరాత్ ఇలా డబ్ల్యూపీఎల్ ప్రత్యర్థులన్నింటిపై విజయాలు సాధించింది. ఇప్పుడు వేదిక వడోదరకు మారినా... రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తీరేం మారలేదు! రెండో రౌండ్ విజయాలనూ మొదలుపెట్టింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సోమవారం జరిగిన పోరులో స్మృతి మంధాన సారథ్యంలోని ఆర్‌సీబీ 61 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది.

వరుసగా ఐదో విజయంతో బెంగళూరు జట్టు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గౌతమి నాయక్ (55 బంతుల్లో 73; 7 ఫోర్లు, 1 సిక్స్) దంచేసింది. రిచా ఘోష్ (20 బంతుల్లో 27; 3 సిక్స్‌లు) వేగంగా పరుగులు చేసింది. స్మృతి మంధాన (23 బంతుల్లో 26; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడింది.

జెయింట్స్ బౌలర్లలో కాశ్వీ గౌతమ్, ఆష్లే గార్డ్‌నర్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 117 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (43 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరిగా పోరాడింది. సయాలీ సత్‌గరే (3/21), నదిన్ డిక్లెర్క్ (2/17) చావుదెబ్బ తీశారు. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) గార్డ్‌నర్ (బి) రేణుక 1; స్మృతి మంధాన (ఎల్బీడబ్ల్యూ) (బి) గార్డ్‌నర్ 26; జార్జియా వోల్ (బి) కాశ్వీ 1; గౌతమి (బి) గార్డ్‌నర్ 73; రిచా ఘోష్ (సి) గార్డ్‌నర్ (బి) సోఫీ డివైన్ 27; డిక్లెర్క్ (నాటౌట్) 4; రాధ (సి) భారతి (బి) కాశ్వీ 17; శ్రేయాంక (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 178.

వికెట్ల పతనం: 1-2, 2-9, 3-69, 4-138, 5-142, 6-170. బౌలింగ్: రేణుక 4-0-23-1, కాశ్వీ గౌతమ్ 4-0-38-2, ఆష్లే గార్డ్‌నర్ 4-0-43-2, హ్యాపీ కుమారి 1-0-10-0, సోఫీ డివైన్ 4-0-25-1, జార్జియా వేర్‌హామ్ 1-0-13-0, తనూజ 2-0-20-0.

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (బి) సయాలీ 3; సోఫీ డివైన్ (సి) వోల్ (బి) సయాలీ 0; అనుష్క (సి) రాధ (బి) డిక్లెర్క్ 18; కనిక (బి) బెల్ 0; ఆష్లే గార్డ్‌నర్ (సి) రావత్ (బి) సయాలీ 54; కాశ్వీ (బి) రాధ 4; జార్జియా వేర్‌హామ్ (సి) సయాలీ (బి) డిక్లెర్క్ 2; భారతి (సి) హారిస్ (బి) శ్రేయాంక 14; తనూజ (నాటౌట్) 11; రేణుక (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 117. వికెట్ల పతనం: 1-3, 2-4, 3-5, 4-34, 5-48, 6-56, 7-97, 8-103.

## రిటైర్‌మెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు: సైనా నెహ్వాల్

స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ బ్యాడ్మింటన్‌కు రిటైర్‌మెంట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. గత రెండేళ్లుగా ఆటకు దూరంగా ఉంటోన్న సైనా.. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. మోకాలి సమస్యతో బాధపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. శారీరకంగా ఆటకు సహకరించనప్పుడు దూరంగా ఉండటమే మంచిదని తెలిపారు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన సైనా. చివరిసారిగా 2023లో సింగపూర్ ఓపెన్‌లో ఆడింది. ''రెండేళ్ల కిందట నేను ఆడటం ఆపేశా. నాకు ఇష్టం కాబట్టే ఈ క్రీడలోకి వచ్చా. ఇప్పుడు ఆడటం లేదు. కాబట్టి, ప్రత్యేకంగా రిటైర్‌మెంట్ అని ప్రకటించాల్సిన అవసరం లేదు. ఆట ఆడేంత సామర్థ్యం లేనప్పుడు ఆగిపోవడం మంచిది. ఇలాంటి నిర్ణయానికి రావడం వెనుక చాలా అంశాలు పాత్ర పోషించాయి. మోకాలి నొప్పి సమస్యగా మారడంతో వెనకడుగు వేశా. ఈ విషయం నా కోచ్‌కు తెలియాలి. నా తల్లిదండ్రులకు తెలియాలి. ఇదే విషయంపై స్పష్టత ఇచ్చా. ఇంతకుమించి మరేం చేయలేనని చెప్పా. ప్రత్యేకంగా రిటైర్‌మెంట్‌పై నేను ప్రకటన చేయలేదు. అయితే, ప్రజలకు ఇప్పటికే అర్థమైపోయి ఉంటుంది. 'సైనా ఆడటం లేదని నెమ్మదిగా తెలుసుకుంటారు'. నా వీడ్కోలు అనేది పెద్ద విషయమేమీ కాదని నా భావన'' అని సైనా వెల్లడించారు.



# ఈ బంతికి ఏమైంది?

న్యూజిలాండ్‌తో సిరీస్ టీమ్‌ఇండియా బౌలింగ్‌లో డొల్లతనాన్ని బయటపెట్టింది. అసలు మనోళ్లు సొంతగడ్డపైనే ఆడుతున్నారా అన్న భావన కలిగేలా ఉంది ప్రదర్శన. ఇటు పేస్‌లోనూ అటు స్పిన్‌లోనూ ప్రభావం శూన్యం. వచ్చే ఏడాదే వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో నాణ్యత లేని భారత బౌలింగ్ ఆందోళన కలిగిస్తోంది. సొంతగడ్డపై ఆడుతుంటే టీమ్‌ఇండియా ఒకప్పుడు తిరుగులేని ఫేవరెట్. అందుకే ఏనాడూ ఈ నేలపై వన్డే క్రికెట్లో కివీస్ పైచేయి సాధించలేకపోయింది. ఈసారి కూడా టీమ్‌ఇండియానే గెలుస్తుందని అనుకున్నారంతా! కానీ ఆ ఊపే లేదు. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన కివీస్.. భారత్‌లో తొలిసారి వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. మన బ్యాటర్లూ విఫలమయ్యారన్నది నిజం. కానీ పరాభవానికి ప్రధాన కారణంగా బౌలింగే కనిపిస్తోంది. భారత్ బంతితో ప్రత్యర్థిని కాస్తయినా భయపెట్టలేకపోయింది. మన బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. సిరీస్‌లో సగటున ఓవర్‌కు 6.2 పరుగులిచ్చారంటే వాళ్ల దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. మ్యాచ్‌ల వేదికలు బౌలింగ్‌కు అనుకూలమైనవేమీ కాదు. కానీ భారత బౌలర్లు విఫలమైన అదే పిచ్‌లపై.. కివీస్ బౌలింగ్ దళం ప్రభావం చూపగలిగింది.

**పసలేని పేస్....** అసలు ఈ వన్డే సిరీస్‌కు బుమ్రాను ఎందుకు ఎంపిక చేయలేదో తెలియదు. బహుశా.. టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో అతడికి విశ్రాంతి అవసరమని భావించి ఉండొచ్చు. ఈ సిరీస్ అంత ముఖ్యమైందిగా అనిపించకపోవచ్చు. కారణమేదైనా.. బుమ్రా లేని పేస్ ఎటాక్ పదును కోల్పోయింది. వికెట్ల వేటలో భారత పేసర్లంతా కివీస్ ఫాస్ట్ బౌలర్లు క్రిస్టియన్ క్లార్క్, జేమీసన్ వెనక నిలిచారు. నిలకడగా 140 కి.మీ వేగంతో బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా ఆరు వికెట్లు పడగొట్టడం తప్పకుండా భారత్‌కు సానుకూలాంశమే. కానీ అతడు పరుగుల ప్రవాహానికి అడ్డుకట్టవేయలేకపోయాడు. ధారాళంగా పరుగులిచ్చాడు. భారత పేసర్లలో అత్యధిక ఎకానమీ రేట్ (6.81) అతడిదే కావడం గమనార్హం. మహ్మద్ సిరాజ్ (3 వికెట్లు, ఎకానమీ 4.59) కట్టుదిట్టంగానే బౌలింగ్ చేసి, బ్యాటర్లకు కళ్లెం వేసినా.. జట్టుకు అవసరమైన వికెట్లను అందించలేకపోయాడు. మరోవైపు ప్రసిద్ధ్ ఏమాత్రం ప్రభావం చూపలేపోయాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. ఇక్కడ టీమ్‌ఇండియా బౌలింగ్ కూర్పుపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆఖరి ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేసే బుమ్రా గైర్హాజరీలో అర్ష్‌దీప్‌ను ఆఖరి మ్యాచ్‌లో గానీ జట్టులోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించేదే. డెత్ ఓవర్లలో అతడు చాలా మెరుగ్గా బౌలింగ్ చేయగలడు. ప్రసిద్ధ్ స్థానంలో అతణ్ని తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడిస్తే సిరీస్ ఫలితం భిన్నంగా ఉండేదన్నది చాలా మంది అభిప్రాయం. ఇక నితీశ్ ఆల్‌రౌండర్ కోటాలో జట్టులోకి వచ్చినా.. బంతితో ప్రభావం చూపలేకపోవడం, వికెట్ల వేటలో విఫలం కావడం జట్టును దెబ్బతీసింది. ఆరంభంలో నిలకడగా వికెట్లు తీసి, మధ్య ఓవర్లలో పరుగుల వేగానికి కళ్లెం వేసి, ముగింపులో గొప్పగా బౌలింగ్ చేసే బౌలర్ భారత్‌కు లేడు. ఏ దశలో బంతి ఇచ్చినా ఫలితం రాబట్టే బౌలర్ ఎంతో అవసరం. 2027 ప్రపంచకప్ ఆరంభమయ్యే లోపు ఈ సమస్యను పరిష్కరించకపోతే ఇబ్బందులు తప్పవు. బుమ్రా, హార్దిక్ పాండ్య తిరిగి జట్టులోకి వస్తే పేస్ బౌలింగ్ పదునెక్కుతుందనడంలో సందేహం లేదు. కానీ సరైన ప్రత్యామ్నాయాలు లేకపోవడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే.



**తిప్పలేక తిప్పలు....** కివీస్‌కు భారత్ వన్డే సిరీస్ కోల్పోవడానికి బౌలింగ్ వైఫల్యం పెద్ద కారణమైతే.. ఆ వైఫల్యంలో మరింత పెద్ద బాధ్యత స్పిన్నర్లది. ఎడమచేతి వాటం స్పిన్నర్లు జడేజా, కుల్‌దీప్ యాదవ్ పూర్తిగా తేలిపోయారు. గతంలో అద్భుతంగా బౌలింగ్ చేసిన కుల్‌దీప్, ఈ సిరీస్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. అతడి ప్రభావం శూన్యం. మూడు మ్యాచ్‌ల్లో 25 ఓవర్లు వేసిన అతడు.. ఏకంగా 7.28 ఎకానమీ రేట్‌తో 182 పరుగులిచ్చాడు. కేవలం మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక జడేజా ఒక్కటంటే ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. ఎకానమీ ఆరుకుపైనే. అసలు అతడు ఉన్నట్లే తెలియట్లేదు. మధ్య ఓవర్లలో ఈ స్పిన్నర్ల వైఫల్యం భారత్‌ను దారుణంగా దెబ్బతీసింది. ఈ ద్వయం వికెట్లూ తీయలేకపోయింది. పరుగుల వేగానికి అడ్డుకట్టా వేయలేకపోయింది. ఇద్దరూ కలిసి 48 ఓవర్లలో 323 పరుగులిచ్చి కేవలం మూడు వికెట్లు పడగొట్టారంటే.. మధ్య ఓవర్లలో వైఫల్యం ఎలా ఉందో అర్థం చేసుకోచ్చు. తొలి వన్డేలో మాత్రమే ఆడిన సుందర్ కూడా ఏమాత్రం రాణించలేదు. ఈ ఒక్క సిరీస్‌లోనే కాదు.. ఇటీవల కాలంలో సొంతగడ్డపై భారత స్పిన్నర్ల ప్రదర్శన బాగా క్షీణించడం ఆందోళన కలిగించే విషయమే. పేలవ ప్రదర్శనల నేపథ్యంలో జడేజా వన్డే భవిష్యత్తుపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్షర్ పటేల్‌ను కాదని బంతితో, బ్యాటుతో వరుసగా విఫలమవుతున్నా జడేజాను కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి. జడేజా కన్నా అక్షర్ చాలా మెరుగని మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. ''ఇద్దరిలో ఒకరిని ఎంచుకోవాల్సి వస్తే అక్షర్‌నే ఎంచుకోవాలి. అతడు చాలా ముందున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటిలోనూ జడేజా కన్నా అక్షర్ చాలా మెరుగు. అక్షర్‌ను కనీసం జట్టులోకి కూడా ఎందుకు తీసుకోలేదన్నది అర్థం కావట్లేదు'' అని అన్నాడు.